
వార్త
ఆదివారం
29 జనవరి, 2023

# జోషిమఠ్.. ఓ గుణపాఠం!






# చైతూ, కృతిశెట్టి జంటగా 'కస్టడీ'

**నాగచైతన్య-కృతిశెట్టి** జంటగా 'కస్టడీ' సినిమా రూపొందుతోంది. టైటిల్ పోస్టర్ నుంచి ఈ సినిమా అభిమానుల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది. చిట్టూరి శ్రీనివాస్ నిర్మించిన ఈ సినిమాకి వెంకట్ ప్రభు దర్శకత్వం వహించాడు. తెలుగు, తమిళ భాషల్లో మే 12వ తేదీన ఈ సినిమాను విడుదల చేయనున్నారు. ఇళయరాజా సంగీతాన్ని అందించిన ఈ సినిమాలో శరత్‌కుమార్ ఒక కీలకమైన పాత్రను పోషించాడు. 'బంగార్రాజు' తరువాత చైతూ, కృతిశెట్టి కలిసి నటిస్తున్న సినిమా ఇది. అందువల్ల అందరిలో ఆసక్తి ఏర్పడింది. ఈ సినిమా హిట్ చైతూకి చాలా అవసరం. వరుస ఫ్లాపులతో ఉన్న కృతికి మరింత అవసరమని చెప్పవచ్చు.

## తారాతీరం

# మారుతి దర్శకత్వంలో ప్రభాస్

ప్రభాస్ చేతిలో ప్రస్తుతం 'సలార్', 'ప్రాజెక్ట్ కె', 'స్పిరిట్' సినిమాలున్నాయి. ఈ ప్రాజెక్టులన్నీ ఆయన ఒకదాని తరువాత ఒకటిగా పూర్తి చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఆయన మారుతి దర్శకత్వంలో చేయనున్న 'రాజా డీలక్స్' సినిమా ఎప్పుడు సెట్స్ పైకి వెళ్తుందా అని అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అయితే ఈ సినిమా షూటింగ్ మొదలైనట్లు తెలుస్తోంది. ప్రభాస్ పాల్గొనగా ఒక షెడ్యూల్, ప్రభాస్ లేకుండా మరో షెడ్యూల్ షూటింగ్ జరిపినట్లు సమాచారం. మూడో షెడ్యూల్ షూటింగులో ప్రభాస్‌తో పాటు మాళవిక మోహనన్ కూడా పాల్గొననున్నట్లు టాక్. ఈ షెడ్యూల్‌లో ఒక యాక్షన్ సీన్ కూడా ప్లాన్ చేశారట. మరో కథానాయికగా నిధి అగర్వాల్ నటిస్తున్న ఈ హారర్ కామెడీ సినిమాను ఈ ఏడాది 'దసరా' పండగకి విడుదల అవనున్నట్లు తెలుస్తోంది.



ఆదివారం వార్త
sunmagvaartha@gmail.com
29 జనవరి, 2023

## మంచి ముత్యాలు

పుస్తకప్రియుడు కానివాడు ఎప్పటికీ
బుద్ధిమంతుడు కాలేడు.

\- శామ్యూల్ జాన్సన్

# విషయ విశేషం

ప్లమ్‌పూల సంబరాలు... 4

'సంఘీ'భావం....5

పొంచి ఉన్న పర్యావరణ ముప్పు

కాబోయే దంపతులకు శిక్షణ ...6

కవర్ స్టోరీ..8

జోషిమఠ్..
ఓ గుణపాఠం!

శ్రీవైద్యనాథ జ్యోతిర్లింగ క్షేత్రం..18

కథ.. 20

ఖలునకు నిలువెల్ల విషము

సాహిత్యం.. 23

మహాయోగి వేమన

ఈవారం కవిత్వం..27

మహాత్మా! చూస్తున్నావా?

మనందరికీ రెండు వయసులుంటాయి!...29

ఇంకా..

పుస్తక సమీక్ష

మొగ్గ

వారఫలం

వగైరా..వగైరా..




# తాజా వార్తలు

## ఉచితంగా పెళ్లి దుస్తులు

కేరళలోని కన్నూర్‌కి చెందిన సబితకి మధ్య తరగతివాళ్ల కష్టాల గురించి బాగా తెలుసు. ఆ నేపథ్యం నుంచే వచ్చిన సబిత ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సు నేర్చుకుని బొటిక్ ప్రారంభించింది. అక్కడికి వచ్చే కొందరు ఆడపిల్లలు తమ పెళ్లిళ్లకు లెహెంగాలు, గాగ్రాలు, డిజైనర్ చీరెలు కొనుకోలేక, డిజైన్ చేయించుకోలేక ఇబ్బంది పడటం గమనించింది. పెళ్లి పీటలెక్కబోయే ప్రతి అమ్మాయీ ఆ సమయంలో అందంగా ముస్తాబవ్వాలనీ, మంచి దుస్తులు ధరించాలని ఆశ పడుతుంది. కానీ కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా వాటికి నోచుకోని అమ్మాయిలను చూసిన సబిత అలాంటి వారికి పెళ్లి దుస్తులను ఉచితంగా ఇవ్వాలని నిర్ణయించుకుంది. తనింట్లోనే నడిపే బొటిక్ పక్కనే ఓ బ్రైడల్ స్టూడియోని ఏర్పాటు చేసింది. తన బొటిక్ ద్వారా వచ్చే ఆదాయంతోనే పలు రకాల లెహెంగాల్నీ, గాగ్రాల్నీ, చీరెల్నీ డిజైన్ చేసి పేద అమ్మాయిలు ఎవరైనా వచ్చి వాటిని ఉచితంగా తీసుకెళ్లే ఏర్పాటు చేసింది. అంతేకాదు, తన స్నేహితులూ, తోటి బొటిక్ నిర్వాహకులతో కలిసి ఓ బృందాన్ని ఏర్పాటు చేసింది. మూడేళ్లలో దాదాపు ఏడు వేల మంది ఆడపిల్లలకు ఉచితంగా పెళ్లిబట్టలను అందిం చింది.

## ఆనందానికి అడ్రస్

గురుకులం, ఖుషియోంవాలా స్కూల్(ఆనందాల బడి) పేరేదే విభిన్నంగా ఉంది. పేరే కాదు అందులో చెప్పే పాఠాలు ఇంకా వైవిధ్యంగా ఉంటాయి. రోబోటిక్స్ నుంచి గార్డెనింగ్ వరకూ థియేటర్ యాక్టింగ్ మొదలు హార్టీకల్చర్ దాకా విభిన్న అంశాల్లో అక్కడ పిల్లలకు శిక్షణ ఇస్తుంటారు. కాన్పూర్‌కి చెందిన ఉద్దేశ్య సచన్ తండ్రి టైలర్. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఫీజు కట్టలేక పోవడంతో ఆరో తరగతిలో ఉన్నప్పుడు ఉద్దేశ్యను స్కూల్ నుంచి బయటికి పంపేశారు. ఆ తర్వాత ఎలాగోలా చదువు కొనసాగించినా చిన్నతనంలో తనను బడి నుంచి వెళ్లిగొట్టిన సంఘటన ఉద్దేశ్య మనసులో అలాగే ఉండిపోయింది. పేద పిల్లలు అలాంటి అవమానాలు ఎదుర్కోకూడదని డిగ్రీ పూర్తయ్యాక ఓ 'గురుకులాన్ని' ప్రారంభించాడు. అక్కడ ప్రత్యేకంగా సిలబస్, తరగతుల వారీగా బోధన, రొటీన్ పరీక్షల వంటివేమీ ఉండవు. పిల్లల వయసు, ఆసక్తిని బట్టి వ్యవసాయం, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మ్యాథ్స్, అడ్వాన్స్‌డ్ క్రాఫ్ట్స్ వంటివి నేర్పిస్తున్నాడు. 'ఈచ్ వన్-ఎడాప్ట్ వన్' పద్ధతిలో దాతల సాయంతో ఈ విద్యా సంస్థను నడిపిస్తున్నాడు ఉద్దేశ్య.





# ప్లమ్‌పూల సంబరాలు

జపాన్ ఈశాన్య ప్రాంతంలో జనవరి మొదటి వారం నుంచి మార్చి మొదటి వారం వరకు ప్లమ్ పూల సంబరాలు జరుగుతాయి. ఈ సమయంలో జపాన్ ఈశాన్య ప్రాంతంలో విపరీతంగా మంచు కురుస్తుంది. ప్లమ్ తోటల్లోని చెట్లు సరికొత్త పూలతో కళకళలాడుతూ కనిపిస్తాయి. 'అటామీ బయినె ఉమె మత్సురి' పేరుతో జరుపు కొనే ఈ వేడుకల్లో చిన్నా- పెద్దా తారతమ్యం లేకుండా అందరూ పాల్గొంటారు. షిజువోకా రాష్ట్రంలోని ఇజు ద్వీప కల్పంలో ప్లమ్ పూల సంబరాలు మరింత వైభవంగా జరుగుతాయి. పూలతో కళకళలాడే ప్లమ్ చెట్ల కిందికి చేరి వనభోజనాలు జరుపుకుంటారు. జపాన్‌లోని అతిపెద్ద ప్లమ్‌తోట 'అటామీ బయినె'కు పెద్ద సంఖ్యలో ప్రజలు చేరుకుని, విందు- వినోదాలతో పాటు సంప్రదాయ నృత్య, సంగీత కార్యక్రమాలతో కాలక్షేపం చేస్తారు. కొందరు సంపన్నుల ప్రైవేటు తోటల్లోనూ ఈ వేడుకలు ఘనంగా జరుగుతాయి. ఈ వేడుకల్లో పాల్గొనడానికి పెద్ద సంఖ్యలో పర్యాటకులు సైతం జపాన్‌కు వస్తుంటారు.











# 'సంఘీ' భావం



## పొంచి ఉన్న పర్యావరణ ముప్పు

పర్యావరణం ప్రమాద ఘంటికలను మోగిస్తోంది. గ్లోబల్ వార్మింగ్‌తో అనేక సమస్యలు మానవాళిని ఇబ్బందులకు గురి చేయనుంది. ప్రస్తుతం ఉత్తరాఖండ్‌లోని జోషీమఠ్ కుంగివేత పర్యావరణ ప్రమాదాన్ని మరోసారి ప్రపంచం ముందుకు తీసుకు వచ్చింది. పర్యావరణపరంగా మానవాళికి ముంచుకు వస్తున్న సమస్య ఎంతో దూరం లేదని జోషీమఠ్ ఉదంతం స్పష్టం చేస్తోంది. ఇక్కడ 2018 నుంచి ప్రతి ఏటా పది సెంటీమీటర్ల చొప్పున భూమి కుంగిపోతూ వస్తోంది. దీనివల్ల కొంత కాలానికి జోషీమఠ్ కనుమరుగయ్యే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క జోషీమఠ్ మాత్రమే కాదు ఇలాంటి అనేక ప్రాంతాలు ప్రపంచంలో అనేకం ఉన్నట్లు తెలుస్తోంది. కేవలం పర్యావరణాన్ని నిర్లక్ష్యం చేయడం వల్లనే ఇలాంటి పరిస్థితులు ఏర్పడుతున్నట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఇకనైనా జాగ్రత్త పడకపోతే కళ్లముందే ప్రళయాన్ని చవిచూడాల్సి వస్తుంది. ఇష్టారాజ్యంగా పర్యావరణానికి నష్టం చేకూర్చడం వల్ల ఒక పక్క సముద్ర మట్టం పెరుగుతూ వస్తోంది. మరోపక్క ప్రతిఏటా ఉష్ణోగ్రతల్లో స్పష్టమైన మార్పులు కనిపిస్తున్నాయి. గత రెండేళ్లుగా పరిశీలిస్తే అకాల వర్షాల ప్రభావం అధికం అయ్యింది. వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు ఏ ఏటికాఏడు గరిష్ట స్థాయిని మించుతూ పోతున్నాయి. ప్రపంచంలో పలు దేశాలు సముద్రతీరంలోనే ఏర్పడ్డాయి. పెద్ద పెద్ద నగరాలు అన్నీ దాదాపుగా సముద్రానికి అతిచేరువలో ఉన్నాయి. ప్రతి ఏటా సముద్రమట్టం పెరుగుతూ భూమిపైకి చొచ్చుకు వస్తోంది. పర్యావరణాన్ని నిర్లక్ష్యం చేయడం వల్ల ఈ పెరుగుదల కొన్ని రెట్లు అధికంగా అవుతూ వస్తోంది. దీనివల్ల కొన్ని సంవత్సరాలకు సముద్రతీరంలో ఉన్న నగరాలు, దేశాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది. దీనివల్ల భారీగా ప్రాణనష్టం కలిగే ప్రమాదం ఉంది. సముద్రపు నీరు వచ్చి ముంచెత్తడంతో అక్కడి ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వలసలు వెళ్లడం ప్రారంభిస్తారు. దీనివల్ల అంతర్గత పోరాటాలు చోటు చేసుకుంటాయి. ఈ సమయంలో మితిమీరిన కాలుష్యం ఏర్పడి భారీ సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంటుంది. ఇప్పటికే మన దేశంలో అనేక నగరాలు గరిష్ట స్థాయిలో వాతావరణ కాలుష్యాన్ని ఎదుర్కొంటున్నట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. సురక్షిత మంచినీరు లభించకపోయే ప్రమాదం ఉంది. దీనితో ప్రజలకు సురక్షితమైన నీరు, గాలి, ఆహారం లభించడం దుర్లభంగా మారే పరిస్థితులు ఎదురౌతాయి. ఇటీవల కాలంలోనే ప్రపంచ వ్యాప్తంగా పర్యావరణ ప్రమాదాలు పొంచి ఉన్నట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. అంటార్కిటికాతో పాటు ప్రపంచ వ్యాప్తంగా హిమానీ నదులు శరవేగంతో కరుతున్నట్లు తెలుస్తోంది. దీనివల్ల అనేక చెడు ప్రభావాలు ఎదురౌతాయి. పొరుగు దేశమైన పాకిస్థాన్‌లో గతంలో ఎన్నడూ లేని విధంగా గత ఏడాది భారీ వరదలు సంభవించాయి. మన దేశంలో గరిష్ట స్థాయిలో వర్షాలు కురిసాయి. అన్ని రిజర్వాయర్లు, ప్రాజెక్ట్‌లు నిండుకుండలా తయారయ్యాయి. అయినా వర్షాలు తగ్గు ముఖం పట్టక పోవడంతో లక్షలాది టిఎంసిల నీటిని సముద్రంలోకి వదిలి పెట్టారు. అమెరికాలో ఇటీవల కార్చిచ్చులతో అతలాకుతలం అయిన కాలిఫోర్నియా ప్రస్తుతం భారీ వరదలకు గురైంది. పర్యావరణ శాస్త్రవేత్తలు చెబుతున్న వివరాల ప్రకారం ఇప్పటికే 80 శాతం వాతావరణంలో దుష్పరిణామాలు కలుగుతున్నాయి. ఉష్ణోగ్రతలు ప్రతి సంవత్సరం పెరుగుతూ వస్తున్నాయి. కర్బన ఉద్గారాలు రెండేళ్ల క్రితమే ఏకంగా 3,500 కోట్ల టన్నులకు చేరాయి. వాతావరణ కాలుష్యం వల్ల ప్రతి ఏటా కొత్తకొత్త వ్యాధులు పుట్టుకు వస్తాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. మరో పదేళ్ల తరువాత ఏటా సుమారు 25 లక్షల మంది వాతావరణ మార్పుల వల్ల వచ్చే వ్యాధులకు ప్రాణాలు కోల్పోతారని అధ్యయనాలు చెబుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా రాబోయే 20 ఏళ్లలో 30 కోట్ల మంది తమ నివాస ప్రాంతాలు కోల్పోయే ప్రమాదం ఉంది. పర్యావరణ ముప్పు విషయంలో సుమారు నాలుగైదు దశాబ్దాల నుంచి హెచ్చరికలు వస్తున్నా పట్టించుకోవడం లేదు. ప్రధానంగా ప్లాస్టిక్ వినియోగం ఒక శాపంగా మారింది. ప్లాస్టిక్ వినియోగం నిరోధానికి అనేక చర్యలు తీసుకున్నా ఆశించిన ఫలితాలు కనిపించడం లేదు. ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల అనేక ప్రాంతాలు కాలుష్య కోరల్లో చిక్కుకుంటున్నాయి. అడవులు సైతం అంతరించి పోయే ప్రమాదం ఉంది. ప్రాజెక్ట్‌ల నిర్మాణం, అభివృద్ధి పేరుతో ఇష్టారాజ్యంగా అడవులను నరికివేస్తున్నారు. రహదారుల నిర్మాణం పేరుతో ఏటా లక్షలాది వృక్షాలను నేల కూలుస్తున్నారు. హైదరాబాద్ నగరంలో మూసీ నది పూర్తిగా కాలుష్యాలతో నిండి ఉంటోంది. హుస్సేన్‌సాగర్‌లో పెద్ద మొత్తంలో కలుషిత నీరు వచ్చి చేరుతోంది. ఇదే పరిస్థితి జీవనదుల్లో కూడా ఉంది. ముఖ్యంగా దేశంలో అతిపొడవైన గంగానది కాలుష్య సమస్యను ఎదుర్కొంటోంది. నగరాలకు సమీపాల్లో ఏర్పాటైన భారీ పరిశ్రమలు వదిలే రసాయనాలు పొగ రూపంలో గాలిలో కలిసి ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. అనేక మంది శ్వాసకోశ వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారు. నదీగర్భంలో ఇసుకను తీయకూడదన్న నిబంధన ఉన్నప్పటికీ యంత్రాలను ఉపయోగించి ఇసుకను తోడేస్తున్నారు. ఆయా నదీగర్భాలనుంచి వెలికితీసిన ఇసుకను నిత్యం వందలాది లారీల్లో నగర ప్రాంతాలకు తరలిస్తున్నారు. అన్ని వైపుల నుంచి పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోంది. దీనివల్ల కొత్తకొత్త సమస్యలు పుట్టుకువస్తున్నాయి. ఇప్పటికైనా తగిన జాగ్రత్తలు తీసుకుని పర్యావరణ పరిరక్షణకు సహకరిస్తే కొంతవరకు విపత్తులను నివారించే అవకాశం కలుగుతుంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ





# కాబోయే దంపతులకు శిక్షణ

**"పెళ్లంటే** నూరేళ్ల పంట" అన్నారో మహాకవి.
"మనసున మనసై బ్రతుకున బ్రతుకై తోడొకరుండిన అదే భాగ్యమూ..అదే స్వర్గమూ.." అని ఎప్పుడెప్పుడా అని ఎదురుచేసే వధూవరుల పెళ్లి పుస్తకం పాణి గ్రహణ శ్రీకారంతో మొదలవుతుంది.

'పెళ్లి' మాట వినగానే మనకు కళ్లముందు ఒక కమ్మని దృశ్యం కనిపిస్తుంది. పచ్చని గడపలు, మామిడి తోరణాలు, భాజా భజంత్రీలు, పట్టుచీరలు ధరించిన మగువలు, తళుకు-బెళుకుల నగలు, విందులు, వినోదాలు....ఇలా కళ్లముందు కమ్మని దృశ్యం కనిపిస్తుంది. పెద్దలు ఇరు కుటుంబాల కులం, గోత్రం, సంఘంలో పరువు, ఆర్థిక స్థోమత, కట్న కానుకలు, అమ్మాయి రూపురేఖలు, అబ్బాయి ఉద్యోగ సామర్థ్యం.. ఇలా చాలా విషయాలను బేరీజు వేసుకుని ఒక వివాహం చేసేవారు.

కాలం మారింది. కాలంతో పాటు, వధూవరుల ఇష్టాయిష్టాలు కూడా మారాయి. ఇందుకు అనుగుణంగా విచిత్ర వ్యవస్థలూ పుట్టుకొస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే "మీరు వివాహం చేసుకోవాలనుకుంటున్నారా? అయితే మేము ఉన్నాం. మీకు అవసరమైన శిక్షణ ఇస్తాం అంటున్నాయి" అంటూ వివిధ సంస్థలు పుట్టుకొస్తున్నాయి. వివాహం చేసుకోవాలనుకునే జంటలకు ఇప్పుడు శిక్షణా సంస్థలు కూడా వెలుస్తున్నాయి. హైదరాబాద్ వంటి మహా నగరాల్లో సంతోషకరమైన వైవాహిక జీవితాన్ని గడపడానికి ఇన్‌స్టిట్యూట్‌లు వెలుస్తున్నాయి. ఇందులో భాగంగానే హైదరాబాద్‌లో కూడా ఒక ఇన్‌స్టిట్యూట్ 'దుల్హా దుల్హన్' పేరుతో కాబోయే జంటలకు శిక్షణ ఇస్తోంది. ఇన్‌స్టిట్యూట్ లక్ష్యాలను ఇలా పేర్కొంటోంది. ఆరోగ్యకరమైన, సంతృప్తికరమైన, ప్రేమపూర్వకమైన దీర్ఘకాల సన్నిహిత సంబంధాలను సాధించడంలో అందరికీ సహాయం చేయడం, భారతదేశంలో విడాకుల రేటును తగ్గించడం, పిల్లలు పెరిగే కుటుంబాల మానసిక ఆరోగ్యాన్ని మెరుగు పరచడమే అని పేర్కొంటోంది. వివాహం చేసుకోవాలనుకునే అబ్బాయి, అమ్మాయిలు ఈ కోర్సు చేయాలంటే వయస్సు 18 నుండి 65 సంవత్సరాల మధ్య వరకూ ఉండాలి.

ఇక కోర్సు వివరాలను చూస్తే- వివాహం అంటే ఏమిటి, అండర్‌స్టాండింగ్ మంత్రం, వివాహం ఎందుకు, కోపాన్ని నియంత్రించుకోవడం, నిర్వహణ నియమాలు, బాధ్యతలు, భర్తల తప్పులు, భార్య ప్రాథమిక అవసరాలు, భర్తలు చేయాల్సినవి, చేయకూడనివి, ఆదర్శభర్తగా ఎలా ఉండగలరు, సంతోష మంత్రం, మూర్ఖపు అంచనాలు, ఆదర్శవంతమైన భార్యగా ఎలా ఉండగలరు, భర్తను ఎలా గెలవాలి, ఇంటిని ఎలా నిర్వహించాలి, ఏ నిర్ణయాలు తీసుకుంటే వాటి ప్రభావాలు ఎలా ఉంటాయి? అనే అంశాలపై శిక్షణ ఇస్తారు.

ఈ అంశాలన్నింటినీ పాఠాల కింద వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా లేదా ఆడియో పాఠాలుగా అందిస్తారు. వీటి నిడివి 60 నిమిషాల పాటు ఉంటాయి. ఈ పాఠాలు హిందీ, ఇంగ్లీష్‌లలో ఉంటాయి.



ఈ కోర్సులు తీసుకోవడం వల్ల కలిగే ఉపయోగాలు కూడా మెండుగానే ఉంటాయి. ఒకప్పుడు మన పెద్దవాళ్లు పెళ్లికి ముందు అత్తవారింట్లో అందరితో ఎలా మెలగాలో చెబుతూ వాళ్లకు నచ్చే విధంగా మసులుకునే పద్ధతుల ను ఈ శిక్షణలో అమ్మాయికి చెబుతారు. భర్తను ఎలా గౌరవించాలి, అతనితో ఎలా మెలగాలనే విషయాన్ని పుట్టింట్లోనే నేర్చుకుంటుంది అమ్మాయి. ఇక అబ్బాయికి సంబంధించి నలుగురిలో ఎలా ఉండాలి, భార్యను బాధ్యత, ప్రేమగా ఎలా చూసుకోవాలి, కుటుంబ గౌరవాన్ని కాపాడుకునే బాధ్యతలను గురించి శిక్షణ

ఇస్తారు. వీటి ద్వారా వైవాహిక జీవితం ఎలా ఉండాలనే ప్లానింగ్‌తో పాటు, పరస్పరం ఇద్దరూ అవగాహనతో ఎలా ఉండాలనేది ఈ ట్రైనింగ్‌లో ఇస్తారు.

## పెళ్లయ్యాక చావు యాత్రకు వెళ్లిన జంట..

పెళ్లి అయిన దంపతుల మధ్య బాండింగ్ పెరగడానికి హనీమూన్ ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. దీంతో వివాహం అయిన తర్వాత జంటలు హనీమూన్‌కు వెళ్లడం సర్వసాధారణం. అయితే ఎవరైనా ఏ చల్లటి ప్రదేశానికో, మంచు కురిసే ఏ ప్రాంతానికో వెళ్లాలనుకుంటారు. లేదంటే ఏ ఊటీయో, కాశ్మీరో, బెంగుళూరో వెళతారు. నేటి రోజుల్లో చాలా మంది హనీమూన్ కోసం విదేశాలకు ఎక్కువగా వెళుతున్న విషయం తెలిసిందే. కానీ పెళ్లి అయ్యాక ఈ దంపతులు ఏకంగా ప్రమాదకరమైన చావు యాత్రకు వెళ్లారు. మండిపోయే ఎండ ఉండే సహారా ఎడారిలోకి వెళ్లి అక్కడ హనీమూన్, ఫొటోలు సైతం చేయించుకుని ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకర హనీమూన్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. అక్కడ ఫొటో షూట్ కూడా తీసుకున్నారు. క్రొయేషియా దేశానికి చెందిన ట్రావెలర్స్ క్రిస్టిజన్ ఇలిసిక్, ఆండ్రియా ట్రిగోవ్‌సెవిక్ వివాహం తర్వాత ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైనదిగా పరిగణించబడే రెండు కిలోమీటర్ల పొడవైన గూడ్స్ రైలులో ఫొటోషూట్ చేయించుకున్నారు. రైలు లోపల బొగ్గు నింపి ఉండగా అందులో తమ ఫొటోషూట్ చేయించుకున్నారు. ఈ సమయంలో రైలు ప్రయాణిస్తున్న ఎడారి ప్రాంతంలో ఉదయం పూట ఉష్ణోగ్రత 45 డిగ్రీలు ఉండగా, రాత్రి పూట సున్నా డిగ్రీల కంటే తక్కువగా నమోదయ్యాయి. ఈ జంట తమ ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌లో సైతం షేర్ చేశారు. ఇంటర్నెట్‌లో ఇవి వైరల్‌గా మారాయి. ఫొటోషూట్ సమయంలో ఇద్దరూ తమ వివాహ దుస్తులను ధరించారు. అత్యంత ప్రమాదకరమైన విషయం ఏమిటంటే ఈ సమయంలో వరుడు రైలు రెండు బోగీల మధ్య నిలబడి వధువును ఎత్తుకొని ఫొటోలకు ఫోజులిచ్చాడు. ఈ ఫొటోషూట్ ప్రయాణానికి మొత్తం ఇరవై గంటల సమయం తీసుకున్నారు. 150 దేశాలను సందర్శించిన క్రిస్టియన్ ఇలిసిక్ ఇది చాలా ప్రత్యేకమైన అనుభవమని, ఫొటోషూట్ సమయంలో వాతావరణ పరిస్థితులు భయంకరంగా ఉన్నాయని, తమ శరీరమంతా మట్టితో నిండిపోయి, ఇక అక్కడ నుండి బయట పడలేమో అని ప్రాణాలపై ఆశలు వదులుకున్నట్లు పేర్కొన్నారు.



## ఇక పెళ్లికి కూడా ఇన్సూరెన్స్..


కరోనా వైరస్ ప్రజల జీవన స్థితిగతుల్లో అనూహ్య మార్పులు తీసుకొచ్చింది. కరోనా సమయంలో వివాహాలు అంటేనే ఆమడ దూరం ఉండే రోజులు చూడాల్సి వచ్చింది. దీనికి తగినట్లుగా మారుతున్న ఆచార, సంప్రదాయాలు, వివాహ వ్యవస్థలో వస్తున్న పరిణామాలు వంటి వాటితో అసలు వివాహాలు, ఎప్పుడు జరుగుతాయో, ఏ క్షణాన వాయిదా పడతాయో తెలియని పరిస్థితి నెలకొంది. వివాహం అనేది చాలా మందితో కూడుకున్న వేడుక. నిశ్చితార్థం జరిగి ముహూర్తాలు పెట్టుకుని పెళ్లి పత్రికలు కూడా పంచుకునేందుకు లక్షల రూపాయలు ఖర్చు చేసి చివరకు పెళ్లి పీటలపై కూర్చున్న తర్వాత వివిధ కారణాలతో అర్థాంతరంగా పెళ్లిళ్లు రద్దయిన సంఘటనలు కోకొల్లలు. ఇలాంటి పరిస్థితుల్లో వివాహం కోసం చేసిన ఏర్పాట్లు, అప్పులు, ఖర్చు అంతా వృథాగా అవుతోంది.



ఈ నేపథ్యంలో ఇటువంటి వారి కోసం కొత్తగా ఇన్సూరెన్స్ చేసుకునే సదుపాయాన్ని అందుబాటులోకి వస్తున్నాయి. ఇన్సూరెన్స్ సంస్థలు, వివాహాలను రీ-షెడ్యూల్ చేసుకున్న సందర్భంగా ఏర్పడే ఆర్థిక నష్టాన్ని నివారించడానికి వివాహ బీమాను అందుబాటులోకి తెస్తున్నాయి. వివాహ బీమా మొత్తం అనేది మీ పెళ్లి బడ్జెట్‌పై ఆధారపడి ఉంటుంది. బీమాపై విధించే ప్రీమియం బీమా మొత్తంలో 0.7 నుండి 2 శాతం మధ్య ఉంటుంది. 10 లక్షల రూపాయల వివాహ బీమా పొందాలంటే 7,500 రూపాయల నుండి 15 వేల రూపాయల వరకూ ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. వివాహం వాయిదా లేదా రద్దు చేయాల్సిన పరిస్థితి ఏర్పడినప్పుడు వివాహ బీమా చేసిన మేజర్ ఖర్చులను కవర్ చేస్తుంది. వివాహానికి సంబంధించిన బీమా పాలసీలు సాధారణంగా నాలుగు రకాలుగా అందుబాటులోకి వస్తున్నాయి. కొన్ని సార్లు వివాహాల సందర్భంగా ప్రమాదాలు, అపశృతులు చోటు చేసుకుంటాయి. వివాహ వేడుకల్లో ప్రమాదం లేదా గాయం కారణంగా ఎవరికైనా నష్టం వాటిల్లితే ఈ కేటగిరీకి చెందిన ఇన్సూరెన్స్ దాన్ని కవర్ చేస్తుంది. అలాగే వివాహాన్ని అకస్మికంగా లేదా ఊహించని కారణంతో రద్దు చేయడం వల్ల కలిగే నష్టాలను ఈ కేటగిరీ కవర్ చేస్తుంది. ఇక వివాహ వేడుకల్లో కొన్నిసార్లు అనుకోని ప్రమాదం జరిగి ఆస్తి నష్టం వాటిల్లుతుంది. ఈ కేటగిరీ అలాంటి నష్టాలను కవర్ చేస్తుంది. పర్సనల్ యాక్సిడెంట్ల కేటగిరీలో ప్రమాదం కారణంగా వధూవరుల ఆసుపత్రికి అయ్యే ఖర్చును కవర్ చేస్తుంది. కాగా వివాహానికి సంబంధించిన బీమాకు సంబంధించి క్యాటరింగ్ కోసం ఇచ్చిన అడ్వాన్స్, వివాహ వేదిక కోసం ముందస్తుగా చెల్లించిన అడ్వాన్స్, ట్రావెల్ ఏజెన్సీలకు చేసిన ముందస్తు చెల్లింపులు, హోటల్ గదులను బుక్ చేయడానికి ఇచ్చిన అడ్వాన్స్, అలంకరణ కోసం అయిన ఖర్చు, పెళ్లిలో ఎంటర్టైన్మెంట్ కోసం ఏర్పాటు చేసిన కచేరి, డ్యాన్స్ ప్రోగ్రామ్స్ కోసం ఇచ్చిన అడ్వాన్స్, వివాహ సెట్ కోసం చేసిన ఖర్చు వంటి వాటికి పరిహారం లభిస్తుంది.



**- సిహెచ్. వి.వి.రఘుబాబు**



# జోషిమఠ్.. ఓ గుణపాఠం!

**కవర్ స్టోరీ**

**రుద్రరాజు శ్రీనివాసరాజు**

> కృష్ణుడు పాలించిన ద్వారక సముద్రంలో మునిగిపోయిందని పురాణాలు చెబుతున్నాయి. అయితే ఇది నిజంగా జరిగిందా లేదా అనే విషయంలో ఎన్నో వాదోపవాదనలు నెలకొన్నాయి. ఆస్తికులు అయితే తమదైన చారిత్రక ఘటనలు చూపిస్తూ ఈ ఘటన వాస్తవం అని నమ్ముతారు. అదే సమయంలో దీనికి శాస్త్రీయ ఆధారాలు లేవని నాస్తికులు ఖండిస్తారు. మొత్తం మీద అది జరిగిందా లేదా అనే దానిని పక్కన పెడితే అప్పుడు ద్వారక తరహాలోనే ఇప్పుడు మరో చారిత్రక పట్టణం రోజురోజుకు భూమి పొరల్లోకి కుంగిపోతోంది అనేది మాత్రం అందరూ నమ్మదగిన నిజం. ఆ పట్టణమే జోషిమఠ్.

**ప్రకృతి** రమణీయతకు మారుపేరు ఉత్తరాఖండ్ రాష్ట్రంలో చమోలీ జిల్లాలో వెలసిన జోషిమఠ్ హిమాలయాల చెంత సముద్ర మట్టానికి 6,107 అడుగుల ఎత్తులో ఉత్తరాఖండ్‌లో ధౌలీ, విష్ణు గంగల సంగమానికి అర కిలోమీటర్ దూరంలో నెలకొని ఉన్న ప్రదేశం జోషిమఠ్. శీతాకాలంలో బదరీనాథుడు కొలువుదీరి భక్తులకు ముక్తిమార్గాన్ని, భక్తిమార్గాన్ని అందించే ప్రదేశమే జోషిమఠ్. హిరణ్యకశిపుడిని వధించిన ఉగ్రనరసింహుడు శాంతమూర్తిగా మారింది ఈ ప్రదేశంలోనేనని వ్యాస విరచిత స్కంధ పురాణం పేర్కొంది. లక్ష్మీ నరసింహస్వామి భక్తుడైన ప్రహ్లాదుడు ఇక్కడ మోక్షం పొందినట్లుగా చెబుతారు. అంతేకాదు, 8వ శతాబ్దంలో సాక్షాత్తూ ఆదిశంకరాచార్యుడు నడయాడిన నేల ఇది. శంకరాచార్యుల ప్రవచనాలు విని పులకించిన పుణ్యభూమి ఇది. ఇక్కడే ఆయనకు ఆత్మజ్ఞానం కలిగింది. ఆయన చేతుల మీదుగా దేశంలో ఏర్పాటైన నాలుగు ప్రధాన పీఠాల్లో ఒకటైన జ్యోతిర్మఠమే జోషిమఠ్, ఈ పట్టణం దాన్నుంచే వచ్చింది. దీనినే జ్యోతిమఠ్ అని కూడా పిలుస్తారు. పేరులో మఠం అని ఉన్నప్పటికీ ఇది పట్టణ ప్రాంతమే. 2011 జనాభా లెక్కల ప్రకారం జోషిమఠ్ జనాభా 17,000. కానీ నేడు సైన్యం, ఇతర విభాగాలన్నింటినీ కలుపుకుని వెళ్తే ఇది 50,000కు పైనే ఉంటుంది. నిత్యం వేలాది మంది భక్తులతో పర్యాటకులతో కిటకిటలాడే పుణ్యక్షేత్రాల్లో ధార్మిక పర్యాటక కేంద్రమిది. ఎత్తయిన హిమాలయ పర్వతాలు దట్టమైన అడవులు, హిమాలయ శిఖరాల అధిరోహణకు వచ్చే అనేక ట్రెక్కింగ్ బృందాలు తరచూ ఇక్కడ దర్శనం ఇస్తూ ఉంటాయి. ఆధ్యాత్మిక పరమైన, మతపరమైన, పర్యావరణపరమైన, చైనా సరిహద్దును ఆనుకొని వున్న ప్రాంతం గనుక వ్యూహాత్మకంగా కూడా జోషిమఠ్ ఎంతో కీలకమైంది. బౌద్ధులకు సిక్కులకు కూడా ఇది పవిత్ర ప్రదేశం. కేదారీనాథ్, బదరీనాథ్ పుణ్యక్షేత్రాలకు ఇది ముఖ ద్వారం. హిమశిఖరాల అధిరోహణకు తరలి వెళ్లే బృందాలు ఈ ప్రాంతం మీదుగానే సాగుతూ ఉంటాయి. యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తింపు పొందిన (పూలలోయ) వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్ చమోలి జిల్లాలోనే 87 చ.కి.మీ. విస్తీర్ణంలో ఈ ప్రాంతంలో ఉంది. సముద్ర మట్టానికి భారీ ఎత్తులో ప్రత్యేక సైనిక ఆపరేషన్లు చేపట్టడంలో ప్రత్యేక శిక్షణ పొందిన గఢ్‌వాల్ స్కౌట్స్ విభాగం ప్రధాన కార్యాలయం కూడా జోషిమఠ్‌లోనే ఉంది. లాభార్జన తప్ప మరేమీ పట్టని కార్పొరేట్ సంస్థలు, అక్రమార్జనకు అలవాటు పడిన నేతలు ఏకమై ప్రకృతి వనరులను దోచుకుతింటున్నారన్న ఏకైక కారణంతో ఏనాడో ఉమ్మడి ఉత్తరప్రదేశ్‌లో సురేష్ బహుగుణ ఆధ్వర్యంలో వృక్షాలను హత్తుకునే అహింసాయు చిప్కో ఉద్యమం ఎన్నో పర్యావరణ ఉద్యమాలకు ప్రేరణగా నిలిచిన ప్రాంతం కూడా ఇదే. పర్యావరణానికి తీవ్ర హానిని కలిగించే తెహ్రీ డ్యామ్‌పై పోరాటానికి శ్రీకారం చుట్టింది కూడా ఇదే ప్రాంతం.




ఇంతటి ప్రాధాన్యతను సంతరించుకున్న దేవభూమి, పర్యాటక ప్రదేశమైన జోషిమఠ్ పర్వత శిఖరం ఇప్పుడు పెద్ద ప్రమాదాన్ని ఎదుర్కొంటోంది. రోజు రోజుకు కాలగర్భం లో కలిసిపోయేలా ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. హిమాలయాల్లో సర్వాంగ సుందరంగా కనిపించే నందనవనమైన జోషిమఠ్ నేడు మన కళ్లముందే కుంగిపో తోంది. గడచిన పన్నెండు రోజుల్లో రోజుకు 5.4 సెంటీమీటర్ల మేర లోపలికి కుంగిపో యిందని శాస్త్రవేత్తలు నిర్ధారించారు. ఆ పట్టణంలో ఒకపక్క ఇళ్లకు పగుళ్లు, నేలకు నెరలు, మరొక పక్క నెరలు తీసిన భూమి నుండి ఉబికి వస్తున్న నీళ్లు. రాత్రి సమయంలో భూమి నుంచి వస్తున్న వింత ధ్వనులు రోడ్ల మీద ఎక్కడ చూసిన భారీ గోతులు.. ఇలా జోషిమఠ్‌లో ఎక్కడ చూసినా భీతావాహ పరిస్థితి.

ఎంతో ప్రేమగా కట్టుకున్న ఇళ్లను వదిలి సురక్షిత ప్రాంతాలకు వెళ్లడానికి మనసు రాక కొన్ని వందలమంది కన్నీళ్లు పెట్టుకుం టున్న జోషిమఠ్ దీనావస్థ ఇది. ఇటువంటి భయానక పరిస్థితుల్లో ఏ క్షణమైనా జోషి మఠ్ పాతాళంలోకి జారిపోవడం ఖాయం అంటూ స్థానికులు బిక్కుబిక్కుమం టూ గడుపుతున్నారు. ఈ పరిస్థితి తీవ్రత గమనించిన ఉత్తరాఖండ్ ప్రభుత్వం పెద్ద ఎత్తున పునరావాస చర్యలు మొదలుపెట్టింది. చాలా మందిని బలవంతంగా సురక్షిత ప్రాంతాలకు తరలించింది.

ఉత్తరాఖండ్‌లో జోషిమఠ్‌లో నెలకొన్న ఈ పరిస్థితే మరికొన్ని కీలక నగరాలు, గ్రామాల్లోనూ నెల కొంది. పౌరి, ఉత్తరకాశీ, బాగేశ్వర్, టహరి, గఢ్‌వాల్, రుద్రప్రయాగ్ ఈ జాబితాలో ఉన్నాయి. జోషిమఠ్ పరిస్థితి చూసి ఆయా ప్రాంతాల ప్రజలు వణికిపో తున్నారు. టహరి జిల్లాలోని అటలి గ్రామం నుంచి రిషికేశ్ కర్ణప్రయాగ రైల్వే లైన్‌పై వెళుతుంది. ఇది నరేంద్రనగర్ నియోజకవర్గంలో ఉంది. ఇక్కడ కూడా తరచూ కొండచరియలు విరిగిపడుతున్నా యి చాలా ఇళ్లు పగుళ్లిచ్చాయి. ఇక్కడ టన్నెల్ పనుల కోసం పేలుళ్లు చేపట్టడం కూడా సమస్యకు ప్రధాన కారణంగా నిలిచింది. ఇక పౌరి విషయానికి వస్తే ఇక్కడ నిర్మిస్తున్న రైల్వే ప్రాజెక్టు కారణంగా ఇళ్లకు పగుళ్లు వస్తున్నాయని ఆరోపిస్తున్నా రు. బాగేశ్వర్‌లో కోపేకోట్ వద్ద కర్‌బగ్ద్ గ్రామంపై నిర్మించిన హైడ్రోపవర్ ప్రాజెక్టు టన్నెల్‌కు రంధ్రాలు పడి నీరు లీకవుతోంది. దీంతో గ్రామస్తులు జలప్రళయం ఎప్పుడు వస్తుందోనని భయపడుతున్నారు. అలాగే ఉత్తరకాశీలో తరచూ కొండ చరియలు విరిగి పడుతు న్నాయి. మరోవైపు, రుద్రప్రయాగ్ విషయానికి వస్తే.. రుషికేశ్ కర్ణప్రయాగ్ రైల్వేలైన్ సొరంగ నిర్మాణం తో ఇక్కడి మరోద గ్రామంలో చాలా ఇళ్లు కూలిపోయే పరిస్థితికి వచ్చాయి. ఇంకా పౌరీ, నైనిటాల్ తదితర పట్టణాలకు సైతం జోషిమఠ్ తరహా ముప్పు పొంచి వున్నదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### ఏమిటీ ఈ విపత్తు!

హిమాలయాల్లో పర్యావరణపరంగా సున్నితమైన ప్రాంతంలో జోషిమఠ్ ఉంది. ఈ ప్రాంతమంతా ప్రాచీన కొండచరియ లలో భాగంగా ఉన్న స్థిరపడని బండరాళ్ల తో ఏర్పడింది. దీని భౌగోళికత ఇతర పర్వతాలతో పోలిస్తే చాలా భిన్నమైనది. ప్రత్యేకించి ఉత్తరాఖండ్ ఉత్తర భాగంలో



హిమాలయ పర్వత సానువుల వెంట ఉండే గ్రామాలు, పట్టణాలు అన్నీ బలహీ న పర్యావరణం కలిగి వున్నాయి. దీని కారణంగా అవి ఎంతో సున్నితత్వం సంతరించుకుని వుంటాయి. అందుకే ఈ ప్రదేశంలో తరచూ కొండచరియలు విరిగి పడుతూ ఉంటాయి.

అంతేకాదు, హిమాలయ పర్వత శ్రేణుల దగ్గర ఉండే ఈ ప్రాంతం అంతా తీవ్ర భూకంపాలు వచ్చే ప్రమాదకర జోన్5లో ఉందని భూగర్భ శాస్త్రవేత్తలు నిర్ధారిం చారు. అందుచేత ఆ పరిసర ప్రాంతాలలో ప్రతిరోజూ ఏదో ఒక చోట స్వల్ప భూకం పాలు వచ్చి పోతూ ఉంటాయి. చాలా వరకు 2 లేదా అంతకు తక్కువ తీవ్రత గల భూకంపాలు రిక్టర్ స్కేల్ మీద నమోదు అవుతూ ఉంటాయి. కానీ మాన వులకు ఇలాంటి భూకంపాలు వచ్చినట్లు తెలియదు. భూకంప తీవ్రత స్కేల్ మీద 3 దాటితేనే మానవులకు తెలుస్తుంది. తరచూ వచ్చే ఇటువంటి స్వల్ప భూకంపాల వలన భూమి లోపలి పొరలు కొద్ది కొద్దిగా సర్దుకుంటూ ఉంటాయి. ఒక పొర ఇంకొక పొరని బలంగా ఢీకొట్టిన పుడు 5 నుండి 7 సీస్మిక్ స్కేల్ మీద నమోదు అవుతాయి. దీనివలన ఇళ్లు కూలిపోవడం లేదా భూమిలోకి కుంగిపో వడం వంటి ప్రకృతి వైపరీత్యాలు కలుగు తాయి. దీనిని దృష్టిలో ఉంచుకునే భూగర్భ శాస్త్రవేత్తలు గతంలో చేసిన శాస్త్రీయ అధ్యయనాలు, సూచనలు ఈ ప్రదేశంలో సొరంగాల తవ్వకం కానీ, పేల్చడం వంటివి చేస్తే అక్కడ నేలకు భంగం కలుగుతుందని ఎప్పుడో హెచ్చరికలు చేశారు. ప్లేట్ టెక్టోనిక్ సిద్ధాంతం ప్రకారం హిమాలయ పర్వతాలు జోన్5లో అంటే భూకంపాలు ఎక్కువగా జరిగే ప్రాంతంలో ఉన్నాయి. అందువల్ల తెహ్రీ, గాఢ్వాల్‌లను భూకంపాలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్న ప్రాంతాలుగా గుర్తించారు. ఈ నేపథ్యంలో భూకంపాలు వస్తే ఆయా ప్రాంతాలు భారీగా నష్టపోతాయని పర్యావరణవేత్తలు ఎప్పటినుంచో హెచ్చరిస్తున్నారు.

భారీ ప్రాజెక్టుల నిర్మాణం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని; అటవులు నశించిపో తాయని, హిమాలయాల్లో నివసించే అరుదైన, అతి విలువైన వృక్షాలు, జంతువులు అంతరించిపోతాయని, జీవావర ణానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని పేర్కొంటున్నప్పటికీ నివారణా చర్యలు చేపట్టడంలో మిన్నకుండి పోయారు.

అభివృద్ధి పేరుతో నిర్మించిన జలవిద్యుత్ ప్రాజెక్టులు, బహుళ అంతస్తుల భవంతులు, కొండల్ని పిండిచేసి నిర్మించే రహదారులు, సొరంగాలు అక్కడి పర్యావరణ సమతౌల్యాన్ని తీవ్రంగా దెబ్బతీశాయి. అడవుల విధ్వంసం గురించి అయితే ఇక చెప్పనవసరం లేదు.
ఆసియాలో అతిపెద్దదైన, దీర్ఘమైన రోప్ ప్రాజెక్టు నిర్మాణం ఇక్కడిదే. ఏమాత్రం ప్రణాళికలేని, అస్తవ్యస్తమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు ముఖ్యంగా పవర్ ప్లాంట్ కోసం పర్వతాలలో పేలుళ్ళు, డ్రిల్లింగ్ చేయడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని పర్యావరణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ చారిత్రక నగరం రాళ్లపై కాకుండా ఒకప్పుడు పర్వత ప్రాంతాలు కుంగడంతో ఏర్పడిన మట్టి, చిన్న చిన్న గులకరాళ్లపై ఏర్పడిందని, అందుకే ఇక్కడి భూమి పెద్ద పెద్ద నిర్మాణాలకు పనికిరాదని గతంలోనే నిపుణులు హెచ్చరించడం జరిగింది.
జోషిమఠ్ పరిసర ప్రాంతాలలో చేపట్టిన నిర్మాణాలన్నీ నీటి వనరుల సహజ ప్రవాహాన్ని అడ్డుకొనే విధంగా ఉన్నాయని ఎప్పుడో నిర్ధారించారు. అయినా వాటిని పట్టించుకోకుండా నిర్మాణాలకు సర్కారు అనుమతులు ఇచ్చేసింది. ఈ నిర్ణయం వలన నదులకు ఎక్కడికక్కడ అడ్డుకట్ట పడి నీరు కిందకు వెళ్లటానికి వేరే మార్గాలను వెతుక్కోవలసి వచ్చింది. ఫలితంగా భూమిలోపల పొరల విచ్ఛిన్నమయ్యాయి. నీరు దారి మళ్లడంతో రాళ్లు కూడా కోతకు గురయ్యాయి.
ఫలితంగా ఈ విపత్తు సంభవించింది అని నిపుణుల నివేదిక. ఒకటి కాదు.. రెండు కాదు.. అయిదు దశాబ్దాలుగా వస్తున్న అన్ని హెచ్చరికలనూ పాలకులు పెడచెవిన పెట్టి అభివృద్ధి మంత్రం జపిస్తూ పర్యావరణాన్ని ఛిద్రం చేయడం వల్లనే నేటి జోషిమఠ్ విపత్తుకు కారణమని నిపుణులు నిర్ధారిస్తున్నారు.

### మిశ్రా కమిటీ


హిమాలయ పర్వత ప్రాంతంలో సముద్ర మట్టానికి 6 వేల అడుగుల ఎత్తుల ఉన్న జోషిమఠ్ పరిస్థితి అయిదు దశాబ్దాల క్రితమే అప్పటి గఢ్వాల్ కమిషనర్ మహేశ్చంద్ర మిశ్ర నేతృత్వంలో ఒక కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆ కమిటీ 1976లో తన నివేదికను సమర్పించింది. నివేదిక ప్రకారం ఎటువంటి ప్రణాళికలు లేకుండా జోషిమఠ్‌లో నిర్మిస్తున్న భవనాలతో ప్రకృతిపై చాలా ప్రభావం పడుతోందని కమిటీ చెప్పింది. జోషిమఠ్ భూగర్భంలోని అంతర్వాహినుల వల్ల ఈ నేలకు కుంగిపోయే గుణమున్నదని హెచ్చరించింది. ఇప్పటికే సహజ ఒత్తిడి నెలకొన్న ఈ ప్రాంతంలో మానవ నిర్మిత కట్టడాలతో మరింత ఒత్తిడి ఏర్పడుతోందని తెలిపారు. ఇదే ధోరణి కొనసాగితే ఎప్పటికైనా ఈ పట్టణం కుంగిపోతుందని ఆనాడే చెప్పారు. ఈ పరిస్థితిని అధిగమించడానికి అభివృద్ధి పేరిట భారీ కట్టడాల వంటి వాటికి అనుమతి ఇవ్వకూడదని ఐదు కిలోమీటర్ల పరిధిలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టకూడదని ముఖ్యంగా విస్తారంగా చెట్లు నాటాలని ఎట్టి పరిస్థులలో కూడా పేలుళ్లకు అనుమతులు ఇవ్వరాదని హెచ్చరించింది. అయితే ఈ హెచ్చరికలు, సూచనలు అన్నీ బుట్టదాఖలయ్యాయి. తరచూ కొండచరియలు విరిగిపడే ఇటువంటి ప్రదేశంలో సైతం తపోవన, విష్ణుఘాట్ ప్రాంతాల్లో జల విద్యుత్ కేంద్రాలకు అనుమతులు ఇచ్చారు. వీటి కోసం సొరంగాలు తవ్వడం, బండరాళ్ల పేల్చడం వంటి కార్యకలాపాలతో అక్కడ భూమి మరింత వేగంగా కుంగిపోయింది. ఆ ప్రాజెక్టులే ఇప్పుడు జోషిమఠ్ ఉనికిని ప్రశ్నార్థకం చేశాయి.


తెహ్రీ డ్యామ్

ఏళ్ల తరబడి మానవ విధ్వంసాన్ని తట్టుకుని ఇప్పటివరకు నిలబడ్డ జోషిమఠ్ ఇక ఏమాత్రం ఒత్తిడిని తట్టుకునే పరిస్థితి లేదని తేలిపోయింది. భూగర్భ పరిశోధక నిపుణులు ఎప్పటికప్పుడు చేస్తున్న హెచ్చరికలను పట్టించుకోకపోవడం వల్లనే ఈ విపత్తు ముంచుకొచ్చింది. 2010లో గఢ్వాల్ విశ్వవిద్యాలయంవారి పరిశోధనలో వరదలు రావడానికి ప్రధాన కారణం కొండలను తొలగించడమేనని ఇటువంటి సున్నిత ప్రదేశాలలో ప్రాజెక్టులకు ఎలా అనుమతులు ఇస్తున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది.
ఐ.పీ.సీ.సీ తన నివేదికలో వరదలు భీకర వర్షాలు ఈ ప్రాంతంలో రావడానికి అటవీ వినాశనం ప్రధాన కారణమని, దీనితో పాటు సున్నితమైన ఈ ప్రాంతంలో మౌలిక వసతుల అభివృద్ధి పేరు చెప్పి పర్యావరణ విధ్వంసానికి కారణం అవుతున్నారని తేల్చి చెప్పింది. ఈ కారణాలన్నీ కలిసి ఈ ప్రాంత ప్రజల మనుగడను మాత్రం ప్రమాదంలోకి నెట్టివేయడం జరిగింది.

### నిర్లక్ష్య ధోరణి

2013లో కేదార్‌లో అతి పెద్ద విషాదాన్ని చూసాం. అయినప్పటికీ పర్యావరణపరమైన జాగ్రత్తలు తీసుకోకుండా అక్కడ అతిపెద్ద జలవిద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం గుడ్డిగా అనుమతులు మంజూరు చేసింది. దీనిని బట్టి పర్యావరణం పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధి ఏమిటి? అనేది అర్థమవుతుంది. సుప్రీంకోర్టుచే నియమితులైన నిపుణుల బృందం కూడా 'మెయిన్ సెంట్రల్ థ్రస్ట్'(ఎమ్‌సీటీ) పై ఉన్న భూభాగాన్ని జలవిద్యుత్ పనుల నుంచి దూరంగా ఉంచాలని సూచించినా పట్టించుకున్న వైనం లేదు.


ఉత్తరకాశీ

2013 కేదార్‌నాథ్‌లో సంభవించిన వరదలకు ప్రధాన కారణం అక్కడ ఏర్పాటు చేసిన జల విద్యుత్ ప్రాజెక్టులు అని పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ 2014లో ఒక అఫిడవిట్ కూడా దాఖలు చేసింది. ఈ ప్రాంతంలో నివసించే ప్రజల భద్రతను దృష్టిలో పెట్టుకుని, ఆ ప్రాంత జలవిద్యుత్ ప్రాజెక్టులపై సమీక్ష అత్యంత అవసరం అనే అభిప్రాయాన్ని కేంద్ర జలవనరుల మంత్రిత్వ శాఖ సుప్రీంకోర్టుకు కూడా తెలిపింది. అయితే ఇవన్నీ అభిప్రాయాలు, సూచనలుగానే భావించారు తప్ప హెచ్చరిక లుగా మాత్రం తీసుకోలేదు అని తెలుస్తుం ది. దీనినిబట్టి ఆ ప్రాంత ప్రజల భద్రత ప్రశ్నార్థకంగా నిలిచింది. ఏ భారీ ప్రాజెక్టు చేపట్టినా అది పర్యావరణ ప్రభావ మదింపు (ఈఐఏ)కు లోబడి ఉండాలి. పర్యావరణ పథకాన్ని (ఈఎంపీ) తప్పనిసరిగా కలిగి ఉండాలి. వాస్తవంగా రోడ్డు ప్రాజెక్టుల కోసం, ఈఐఏ పరిధి 100 కిలీమీటర్లు మాత్రమే. కానీ ఈ నిబంధన నుంచి తప్పించుకోవడానికి తెలివిగా చార్‌ధామ్ ప్రాజెక్టును ఒక్కొక్కటీ 100 కిలోమీటర్ల కంటే తక్కువ ఉండేలా 53 ప్రాజెక్టులుగా విభజించారు. వీటి వలన పర్యావరణానికి తీవ్ర హాని కలుగనుందని తెలిసినప్పటికీ ఎటువంటి తనిఖీ, క్రమబద్ధీకరణ ప్రాజెక్టుల నిర్మాణాలకు పచ్చ జెండా ఊపేశారు.

### చార్‌ధామ్ ప్రాజెక్టు

పర్యావరణ పరమైన ఎన్నో హెచ్చరికలు ఉన్నప్పటికీ ఇవే కొండల్లో 800 కిలోమీటర్ల పొడవైన నాలుగు లేన్ల 'చార్‌ధామ్ హైవే ప్రాజెక్టు'ను ప్రారంభించారు. దీనికోసం వేలాది చెట్లను విచ్చలవిడిగా నరికివేశారు. ప్రాజెక్ట్ పేరిట విశాలమైన రహదారులు, నిర్మాణమవు తున్నాయి. నదీ ప్రవాహాలకు ఈ రహదా రులు ఆటంకమవుతుంటే అవి వేరే దోవ వెదుక్కుంటున్నాయి. 12 మీటర్ల వెడల్పు డబుల్ లేన్ ఏర్పాటు కోసం కొండవాలు లను అస్థిరపరచడం, సహజమైన ఊటలను ధ్వంసం చేయడం, వీటితో పాటు లోయల కింది భాగంలో చెత్త, వ్యర్థాలను కుప్పతెప్పలుగా పోయడం వంటి చర్యలు వలన ఈ ప్రాంత పర్యా వరణంలో సమతౌల్యం లోపించింది. ముఖ్యంగా ఈ ప్రాజెక్టులు మదింపు చేయడానికి సుప్రీంకోర్టు నియమించిన అత్యున్నత సాధికారిక కమిటీ ఈ ప్రాంతాన్ని అణువణువు పరిశీలించి పర్యా వరణ విధ్వంసం జరగడానికి రోడ్డువెడల్పు చేయడమే ప్రధాన కారణం అంటూ తన నివేదికలో నిగ్గు తేల్చింది. ఇప్పటికైనా ఈ వెడల్పు తగ్గిస్తే నష్టాన్ని చాలా వరకు తగ్గించే అవకాశం ఉందని కూడా సూచించింది.

బలహీనమైన పర్వత ప్రాంతాల్లో వెడల్పాటి హైవే నిర్మాణం చేపట్టకూడదు అనే విషయం రోడ్డురవాణా మంత్రిత్వ శాఖకు తెలియంది కాదు. దీని వలన ఏర్పడే విపత్తు తెలిసినా ఒత్తుడుల నేపథ్యంలో రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ మిన్నకుండి పోయింది. నిబంధనలకు పాతరేసి పర్యావరణ విధ్వంసానికి





కారణభూతమైంది. చార్‌ధామ్ ప్రాజెక్ట్ విషయమై సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ సూచనలు పరిగణలోనికి తీసుకోకుండా ప్రాజెక్ట్‌ను ముందుకు తీసుకువెళ్లే నైజాన్ని గుర్తించిన నిపుణుల కమిటీ ప్యానల్ ఛైర్మన్ రవి చోప్రా రాజీనామా ప్రకటించారంటే అక్కడ పరిస్థితి తీవ్రత మనకు అర్థం అవుతుంది. తపోవన విష్ణుగఢ్ జలవిద్యుత్ ప్రాజెక్ట్ దశాబ్దం కిందట తపోవన విష్ణుగఢ్ జల విద్యుత్ ప్రాజెక్ట్ కోసం ఎన్‌టిపిసిసి ఈ ప్రాంతంలో సొరంగాలు తవ్వడం ప్రారంభించినప్పటి నుండి తమకు నష్టం మొదలయ్యిందని స్థానికులు మొదటి నుంచీ ఆరోపిస్తున్నారు. ఉద్యమాలు కూడా చేశారు. అయితే ఎన్‌టిపీసీ మాత్రం దానికి అంగీకరించడం లేదు. తపోవన విష్ణుగడ్ జల విద్యుత్ ప్రాజెక్టుకు అనుసంధానిం చబడిన 12 కిలోమీటర్ల పొడవైన సొరం గం జోషిమఠ్ పట్టణానికి ఒక కిలోమీటర్ దూరంలో ఉందని, ఈ ప్రాంతంలోని భూమి క్షీణించడంలో తమ ప్రాజెక్టు పాత్ర లేదని ప్రభుత్వ యాజమాన్యంలోని ఎన్‌టీపీసీ కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖకు తెలిపింది. జనవరి 10న కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ జోషిమఠ్‌లో మునిగిపోయిన ఘటనపై సమీక్షించేందుకు ఎన్‌టీపీసీ అధికారులను పిలిపించింది. ఒకరోజు తర్వాత భారతదేశపు అతిపెద్ద విద్యుత్ ఉత్పత్తి సంస్థ తన వైఖరిని వివరిస్తూ మంత్రిత్వ శాఖకు లేఖ కూడా రాసింది. తపోవన్ విష్ణుగడ్ హైడ్రో ఎలక్ట్రిసిటీ ప్రాజెక్టు ఉత్పత్తి కోసం డ్యామ్ ప్రాంతం లోని నీటిని విద్యుత్ కేంద్రానికి అనుసం ధానించే హెడ్ ట్రేస్ టన్నెల్ (హెచ్‌ఆర్‌టి) 'జోషిమఠ్ పట్టణం కిందకు వెళ్లడం లేదు' అని వివరించింది. 'సొరంగం జోషిమఠ్ పట్టణం వెలుపలి సరిహద్దు నుంచి 1.1. కి.మీ. దూరంలో, నిలువుగా నేల మట్టానికి 1.1 కి.మీ. దిగువన క్షితిజ సమాం తర దూరంలో ఉంది' అని ఎన్‌టీపీసీ తన లేఖలో రాసింది.

### ఇస్రో నివేదిక

తాజాగా భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) విడుదల చేసిన నివేదిక ప్రకారం జోషిమఠ్ శరవేగంగా కుంగిపో తోంది. జనవరి 2న చోటు చేసుకున్న క్షీణత కారణంగా హిమాలయ పట్టణం కేవలం 12 రోజుల్లో 5.4 సెంటీమీటర్ల వేగంతో మునిగిపోయిందని నివేదిక తెలిపింది.

ఇస్రోకు చెందిన జాతీయ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్‌సీ) ప్రాథమిక అధ్యయనం ప్రకారం ఏప్రిల్–నవంబరు 2022 మధ్య భూమిక్షీణత నెమ్మదిగా ఉంది. ఈ సమయంలో జోషిమఠ 8.9 సెం.మీ. కుంగిపోయింది. కానీ డిసెంబరు 27,2022 జనవరి 8, 2023 మధ్య భూమిక్షీణత తీవ్రత పెరిగింది. ఈ 12 రోజుల్లో పట్టణం 5.4 సెం.మీ. కుంగింది. కార్టోశాట్–2 ఎస్ ఉపగ్రహం నుంచి ఈ చిత్రాలను తీశారు. "కొన్ని రోజుల వ్యవధి లో ఈ ప్రాంతం దాదాపు 5 సెం.మీ. క్షీణించింది. క్షీణత ప్రాంత పరిధి కూడా పెరిగింది. కానీ అది జోషిమఠ్ పట్టణం మధ్య భాగానికి మాత్రమే



పరిమితమైంది" అని ఎన్ఆర్ఎస్సీ నివేదిక పేర్కొంది. జోషిమఠ్ చుట్టుపక్కల ప్రాంతాలు ఏటా 2.5 అంగుళాల మేరకు భూమిలోకి దిగిపోతున్నట్లు డెహ్రాడూన్‌లోని జాతీయ రిమోట్ సెన్సింగ్ సెంటర్ గుర్తించింది. హిమాలయన్ జియాలజి ఇన్‌స్టిట్యూట్ జోషిమఠ్ పరిస్థితిపై 2021 సంవత్సరంలో ఓ నివేదికను సమర్పించింది. ఆ నివేదిక ప్రకారం భూమిలో అంతర్గతంగా ప్లేట్ కదలికల వల్ల ఏర్పడుతున్న పరిణామాలే కాకుండా అభివృద్ధి కార్యకలాపాల పేరిట చేస్తున్న తవ్వకాలు వంటివి కూడా జోషిమఠ్‌ను ప్రమాదకర స్థితిలోకి నెట్టేశాయని అందులో పేర్కొన్నారు.

అభివృద్ధి సాధనలో ప్రకృతి అందించిన సహజ వనరుల వినియోగం తప్పనిసరి. అయితే ఆ వినియోగం అనేది విచ్చలవిడితనం కారాదు. అది గమనించి నడుచుకోగలిగితే ప్రకృతిలో సమతౌల్యత సిద్ధిస్తుంది. ఇటువంటి విపత్తులకు అవకాశం లేకుండా పోతుంది.

ప్రధానంగా జోషి మఠ్ వంటి సన్నితమైన హిమవత్పర్వత ప్రాంతంలో పర్యావరణం పట్ల అత్యంత జాగరూకతతో వ్యవహరించాలి. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ అభివృద్ధి సాగిస్తున్న నిర్మాణాలే ప్రస్తుత దుస్థితికి కారణం. పర్యావరణానికి జరిగే హాని వలన వాతావరణంలో ఏర్పడే మార్పులను విస్మరించి దేశంలో పర్యాటకాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహి స్తున్నాం.. అని గర్వంగా చెప్పుకుంటున్న ప్రభుత్వాలు ఆ ప్రదేశాల సున్నితత్వాన్ని, సామర్థ్యాన్ని పరిగణలోకి తీసుకోకపోవడం వల్లనే ఇటువంటి విపత్తులు సంభవి స్తున్నాయి. ప్రత్యేకించి ధార్మిక పర్యాట కాన్ని ప్రోత్సహించడం ద్వారా ఆర్థిక ప్రయోజనాలు మెరుగవుతాయని, ఎన్నో వేల ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వాలు చెబుతున్నాయి. పైగా ఇటువంటి సున్నిత ప్రాంతాలలో టూరిజాన్ని విచ్చలవిడిగా ప్రోత్సహిస్తూ రైళ్లు, రోడ్లు, రోప్‌వేలు ఏర్పాటు చేయడం ద్వారా ప్రపంచంలోనే భారత్‌లోగల ఈ ప్రాంతం ఎక్కువ మంది విదేశీయులను ఆకర్షించే విధంగా అత్యున్నత ధార్మిక ప్రాంతంగా నెలకొల్పాలనే ఆత్రుత మాత్రమే ప్రభుత్వాలలో మెండుగా కనిపిస్తుంది.

జోషిమఠ్‌లో ఇంత విపత్తు ముందుకు వచ్చినా ఈ ప్రమాదం కేవలం ప్రకృతి వైపరీత్యం మాత్రమేనని మానవ తప్పిదం మాత్రం కాదనే రీతిలో తమ నిర్లక్ష్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నాలు కూడా ఆరంభమయ్యాయి.

పర్యావరణ పరిరక్షణకై ఏర్పాటు చేసిన అంతర్జాతీయ వేదికలపై మాత్రం భారత్ ఘనంగా పర్యావరణ పరిరక్షణ నినాదాలు ఇస్తూ వాస్తవంలో దానికి తూట్లు పొడిచే యత్నాలు అవిఘ్నంగా కొనసాగిస్తున్నారు. 2013 కేదార్‌నాథ్‌లో భీకర వరదలు సంభవించినపుడు కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది. ఆనాడు ప్రతిపక్ష హోదాలో ఉన్న బీజేపీ మాత్రం పార్లమెంట్‌లో ఈ ఘటనను గురించి ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించింది. అంతేకాదు, ఉత్తరాఖండ్‌లో అభివృద్ధి పేరుతో ప్రభుత్వం ప్రకృతి, పర్యావరణంపై విపరీతమైన దాడులు చేస్తోందని ప్రభుత్వాన్ని నిలదీసింది. ఎన్‌టిపిసి జల విద్యుత్ ప్రాజెక్ట్‌కి 2006లో అప్పటి యుపిఏ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అయితే అప్పటి యుపిఏ ప్రభుత్వం మొదలు పెట్టిన దానినే ప్రస్తుతం బిజెపీ ప్రభుత్వం కూడా కొనసాగిస్తున్నది. అంతే కాదు, గత ఎనిమిదేళ్లుగా కేంద్రం బీజేపీనే అధికారంలో ఉంది. ఉత్తరాఖండ్‌లో కూడా రెండేళ్లకు పైగా బీజేపీనే పాలిస్తోంది. మరి ఈ సమయంలో పర్యావరణ పరిరక్షణకు ప్రస్తుత ప్రభుత్వం ఏం చేసింది? అనేది మాత్రం మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలింది. ఏది ఏమైనా వికాసం పేరుతో పర్యావరణ వినాశనాన్ని కోరి తెచ్చుకున్నట్లు అయ్యింది. ఇవన్నీ చూస్తే ప్రకృతి మనపై పగబట్టడం కాదు.. మనమే ప్రకృతి మనపై పగబట్టేలా చేస్తున్నాం అనేది మాత్రం అక్షర సత్యం. ఇప్పటికిప్పుడు ప్రభుత్వాలు హడావిడిగా ఈ విపత్తుకు పరిష్కారం కానీ, ప్రత్యామ్నాయం కానీ చూపే అవకాశం ఏ విధంగానూ లేదు. తక్షణ కర్తవ్యంగా జోషిమఠ్ బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించి వారిలో మనోధైర్యాన్ని కలిగించాలి. అంతకన్నా ముఖ్యంగా జోషిమఠ్‌లో నెలకొన్న వాస్తవ పరిస్థితులను ప్రభుత్వం ప్రకటించాలి. లేకపోతే అక్కడ జరిగిన సంఘటనల గురించి సామాజిక మాధ్యమాలలో ఎలక్ట్రానిక్ మీడియాలో గోరంతలు కొండంతలుగా ప్రచారం జరిగే ప్రమాదం నెలకొని ఉంది. దీనివలన ఎక్కువగా నష్టపోయేది జోషిమఠ్ వాసులే. ఎందుకంటే ఈ పట్టణ ప్రాంత ప్రజలు అందరూ పర్యాటకులు తమ పట్టణానికి రావడం వలన ఉపాధి పొందుతున్నవారే. అయితే ఈ సమయంలో జోషిమఠ్‌పై అవాస్తవాలు ప్రచారం జరిగితే ఇక్కడికి వచ్చే పర్యాటకులు కూడా తగ్గిపోతారు. ఫలితంగా పర్యాటకంపై ఎక్కువ ఆధారపడి జీవిస్తున్న జోషిమఠ్ ప్రజానీకం ఎదుర్కొనే ఆర్థిక ఇబ్బందులు చెప్పనలవి కాదు. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్రాలు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



అయితే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం అనేది రోజుల్లో సాధ్యం కానే కాదు. దశాబ్దాల తరబడి చేస్తున్న హెచ్చరికలు గాలికి వదిలేసి ఈ రోజుకీ రోజూ ఘనంగా నివారణా చర్యలు చేపడతాం అని చెప్పడం ఏమంతా హేతుబద్ధం కాదు. ఇకనుంచి అయినా ప్రభుత్వాలు పర్యావరణ చట్టాల్లో లొసుగులు వెదకడం మానివేసి చట్టానికి మినహాయింపులు తీసుకువచ్చే ప్రయత్నాలు పక్కన పెట్టి పర్యావరణ పరిరక్షణే పరమావధిగా నడుచుకున్ననాడు ప్రకృతిని శాంతింపచేయగలుగుతాం. దీనివలన ప్రస్తుత తరాల వారితో పాటు భావితరాలవారి ప్రయోజనాలను కాపాడే విధంగా కొనసాగించగలిగే అభివృద్ధిని నిలబెట్టగలిగినవాళ్లం అవుతాం. ఇప్పటికైనా పాలకులు పరిస్థితులు చేయి దాటిపోకుండా తక్షణ చర్యలతో పాటు శాశ్వత చర్యలకు ఉపక్రమించవలసిన అవసరం నేడు అత్యంత ఆవశ్యకం. ❍

# పుస్తక సమీక్ష



## మరపురాని మధురస్మృతులు

తన వాగ్ధాటితో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేయగలిగిన మహావక్త వోలేటి పార్వతీశం. ప్రసార మాధ్యమంలో నాలుగు దశాబ్దాల సుదీర్ఘ అనుభవం గడించిన వోలేటి తన జ్ఞాపకాలతో కవితలను అల్లి 'పరిచయ పత్రాలు' పేరిట ఓ కవితా సంపుటి వెలువరించారు. సింహభాగం స్మృతికవితలు కాగా కొన్ని తన, స్నేహితులు, బంధువులతో పెనవేసుకుపోయిన అపురూప క్షణాలు (నాస్టాలియా) మరికొన్ని కొత్తగా స్పృశించిన పురాణపాత్రల ప్రస్తావనలు. 'గాలిని కూడా స్తంభింప చేయగల సంకల్పుడు'గా మహాత్మాగాంధీని అభివర్ణిస్తూ..అక్కినేని తర్వాత 'నదులు, సెలయేళ్లు ప్రవహిస్తూనే వున్నాయి..అవేమీ స్తంభించిపోలేదు.. నిజమేకానీ, ఆ ప్రవాహంలో జీవమేదీ?' అంటూ నటసామ్రాట్టుకు నివాళ్లులర్పిస్తారు. 'కాషాయం కట్టని ఋషి'గా పొత్తూరి వెంకటేశ్వరరావుని స్మరిస్తూ, 'ఆమనిలో విహరించిన వాడు..ఇప్పుడు యామినిలో తిరుగాడుతున్నాడు' అంటూ శ్రీశ్రీని శ్లాఘిస్తారు. యిలాంటి స్మృతి కవితలు ఎన్నెనో! ఓలేటివి, నాన్న తనకిచ్చిన జ్ఞాపకాలకు, క్షణక్షణం తనను పలకరిస్తున్న చిన్నప్పటి రోజులకు 'శతమానం' చెప్పుకున్న కవితలు అబ్బురపరుస్తాయి. నిర్జీవుడైన తమ్ముడి శరీరం నుండి అవయవదానం చేసిన ఓ అక్కను 'నువ్వు ఆడపిల్లవు మాత్రమే కాదు..స్వయానా ఆ బ్రహ్మకు చెల్లివి' అని వర్ణిస్తూ రాసిన కవిత ఓలేటి పార్వతీశం పరిణత కవితా నిర్మాణ నైపుణ్యాన్ని ఎత్తిచూపుతుంది. **(పరిచయ పత్రాలు, రచన: వోలేటి పార్వతీశం, వెల: రూ 150, ప్రతులకు: ఫ్లాట్‌నెం.502, బృందావన్ రెసిడెన్సీ, గగన్‌మహల్, దోమలగూడ, హైదరాబాద్)** **- రమణ వెలమకన్ని**



## నవ్వించే కథలు

కథలు రాయటం, అందులో అందరూ మెచ్చే కథలు రాయటం కష్టమైనపనే. కానీ దీనికన్నా కష్టమైనపని హాస్యకథలు రాయటం. హాస్యకథలు రాసి అందరినీ మెప్పించటం కష్టం. ఇతర కథలు ఎలాగో అలాగ రాయవచ్చు. కానీ హాస్య కథలు రాయటం అంటే సామాన్యం కాదు. ఒకరు చెప్తున్నప్పుడు పడీపడీ నవ్విన జోక్, ఇంకొకరు చెప్తుంటే నవ్వించదు. ఒకసారి నవ్వించిన అంశం మరోసారి నవ్వించదు. వ్యక్తి మంచి వ్యక్తిత్వ సందర్భం నుంచి సందర్భంలో మారే 'హాస్యం' సృష్టించి, చదివిన ప్రతివారు, చదివిన ప్రతిసారీ నవ్వించగలిగే కథలను సృజించటం అందుకే అందరికీ సాధ్యంకాదు. గొప్ప పేరున్న రచయితలు ఎంతోమంది ఉన్నా ప్రపంచవ్యాప్తంగా హాస్య రచయితల పేర్లు గుప్పెడే. అందుకే గిరిజారాణి కలవల రచించిన 35 హాస్యకథల సంపుటి ఆనందంతో ఆశ్చర్యం కలిగిస్తుంది. అడుగడుగునా నవ్విస్తూనే కథలతో పాటు కథలసారాన్ని ప్రదర్శిస్తూ నవ్వుకి, నాలుగు నవ్వులు జోడిస్తాయి. కథలకు సరిపడ వేసిన చిత్రాలు. ఈ సంపుటిలోని కథలలో పాత్రలన్నీ మనకు నిత్యజీవితంలో తారసపడేవే. సంఘటనలు నిత్యజీవితంలో ఏదో ఓ సందర్భంలో మనం ఎదుర్కొనేవే. అలాంటి సాధారణ వ్యక్తిత్వాలు, సంఘటనల నుండి హాస్యం పిండి రచయిత్రి వండిన నవ్వుల రొట్టెలు ఈ కథాసంపుటిలోని కథలు. దేనిరుచి దానిదే. హాస్య ప్రియులు తప్పనిసరిగా చదవవలసిన కథల సంపుటి ఇది. **(జగడాల జలజాక్షి, రచన: గిరిజారాణి కలవల, వెల: రూ 150, ప్రతులకు: నవోదయ బుక్‌హౌస్, కాచిగూడ, హైదరాబాద్)** **- నిర్మోహి**



## శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి

మహామహోపాధ్యాయ, రాష్ట్రపతి సన్మాన విభూషిత డా.పెదపాటి నాగేశ్వరరావు, మహాయోగి, కాలజ్ఞాని, దైవీశక్తి సంపన్నులైన శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి, జీవిత విశేషాలను తెలుగుసేతగా పాఠకులకు ప్రతిభావంతమైన ఆధ్యాత్మిక జిజ్ఞాసతో అందచేసారు. సాహిత్యబ్రహ్మ ఆంధ్రప్రదేశ్ ప్రాచ్యపరిశోధనాలయ మేధావిగా లబ్ధ ప్రతిష్ఠులైన డా.వివియల్. నరసింహారావు ఆంగ్ల రచనయిది. బహుభాషావేత్త, కవి, గ్రంథకర్త, మఠం ప్రస్తుత ఆస్థాన విద్వాంసులైన డా.పెదపాటి, తెలుగుసేతగా విశ్వర్ధి ప్రచురణలు, సనాతన సాహితీ తెలుగు చదువరులకు ఈ గ్రంథాన్ని అందజేయడం అభినందించతగ్గ విషయం. వీరబ్రహ్మేంద్రుని జీవిత విశేషాలను రచయిత పరిశోధనాత్మకంగా అన్వేషించి, స్వయంగా ఆ మహాపురుషుని జీవనకాల అద్భుత కథనాలు, అనుభూతులు, తత్వగీతాలు, దివ్యబోధనలు, జ్ఞానవచనాలు, జానపద తాత్వికత కనులకు కట్టించారు. వేమన, వీరబ్రహ్మేంద్రులు యిద్దరూ యోగులుగా యిద్దరి జీవన మార్గాలలోని సమాజసంస్కరణ చైతన్యం, నాటి రాజకీయ, సాంఘిక స్థితిగతులను, 17వ శతాబ్దంలో తెలుగునాడు ఎదుర్కొన్న అధిభౌతిక మనోమథనాన్ని, తిరుగుబాటు తత్వాలను డా॥వివిఎల్ ఆంగ్లంలో ప్రపంచానికి తెలియచేశారు. విశిష్ట ప్రతిభాసంపన్నులైన డా॥పెదపాటి నాగేశ్వరరావు ఈ తెలుగుసేతను, వెలుగులోకి తెచ్చిన సంపాదకులు గోనుగుంట వీపూరయాచార్యులు, పులుకూరిచంద్రప్రకాశరావు, వాశిలినాగ విద్యాసాగర్ అభినందనీయులు. **(శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి, వెల: రూ 80, ప్రతులకు: గోనుగుంట వీపూరయాచార్యులు, ఫ్లాట్4, బ్లాక్-7, ఇక్రిశాట్ ఎన్‌క్లేవ్, ఈస్ట్‌ఆనందబాగ్, మల్కాజ్‌గిరి, హైదరాబాద్)** **- ఎర్రమిల్లి**



## దేశదిమ్మరి చెప్పిన పురాగాథలు

ఈ కథా సంపుటి రచయిత శ్రీనివాసమూర్తి చాలా తక్కువ కథలు రాస్తారు. అయితేనేం కాల్పనికశక్తి దృక్పథబలం, మానవ జీవితాల్లో గోచరమయ్యే సంక్లిష్టత, తార్కికత, వాస్తవికతావాద శిల్పంతో గొప్ప కథల్ని సృష్టిస్తారు. చిత్తూరు జిల్లాలోని ఏనుగులను మచ్చిక చేసుకోవటం (కోవెలమావటి) నుండి, కందవోలు (కర్నూలు), చాకలుగ గాడిదలు మాయం కావటం (ఓటుమల్లన్న), రెడ్డిగార్లగడ్డాలు గీకి నెత్తులు గొరిగే మాదన్న, అమ్మానాయన్ను మింగి భూమ్మీద పడిన 'అడివోడు (ఆడివోడు కథ) నుండి మొదలుపెట్టి కల్లోల కాశ్మీరంలో చంపబడుతున్న కాశ్మీర ప్రజలు (ఖబర్ కె సాత్) వరకు మూర్తి కథా వస్తువులే! స్థానిక ఉద్యమాల నుండి, జాతీయ, అంతర్జాతీయ పరిణామాలు వీరి కలంలో ప్రాణం పోసుకుంటాయి. వస్తుశిల్పం, కథాగమనం చాలా అలవోకగా నడుస్తాయి కథల్లో. ఏనుగుల మందను వేటాడే 'ఖేద్దా' తెలుసు. కాశ్మీర్‌లోని కాందూర్ అంగడిలో వాసా రొట్టెలను తందూర్‌లో కాల్చే విధానమూ, రచయితకు తెలుసు. కర్నూలు మాండలికం, నుడికారంతో భాషాసౌందర్యాన్ని ఇనుమడింప చేసారు. సంపుటికి ముందు మాటలో చెప్పినట్లు 'పాఠకుల వ్యక్తిత్వాన్ని తేజోవంతం చేయగల' కథలు ఇవి. **(ఖబర్ కె సాత్, రచన: శ్రీనివాసమూర్తి, వెల: రూ 150, ప్రతులకు, నవోదయ, నవతెలంగాణ బుక్‌హౌస్, హైదరాబాద్)**

**- కూర చిదంబరం**

# సోలో ట్రిప్‌కు అనువైన ప్రదేశాలు



**చాలామందికి ట్రావెలింగ్ అంటే ఇష్టపడతారు. ఎప్పటికప్పుడు కొత్తకొత్త ప్రదేశాలు సందర్శించడం పట్ల ఆసక్తి చూపుతారు. ఎక్కడికైనా సోలోగా వెళ్లడానికి ప్రయత్నిస్తారు. సోలో ట్రిప్ ప్లాన్ చేస్తుంటే పర్యాటించాల్సిన బెస్ట్ ప్లేసెస్.**

**నెదర్లాండ్స్**

ఒంటరిగా ప్రయాణించాలనుకునేవారికి సులభమైన ప్రదేశాల్లో నెదర్లాండ్స్ ఒకటి. ఏప్రిల్‌లో నెదర్లాండ్‌లో పర్యటిస్తే అందమైన తులిప్ ఫీల్డ్‌లను అన్వేషించడానికి, ఆమ్‌స్టర్ డ్యామ్ గుండా బైక్‌ను నడపడానికి అవకాశం ఉంటుంది. ఇదే మొదటి సోలో ట్రిప్ అయితే హోటల్‌లో ఒంటరిగా ఉండడానికి ఇబ్బంది పడితే, ఆతిథ్యం అందించడానికి అనేక హాస్టల్స్ సైతం అందు బాటులో ఉంటాయి. నెదర్లాండ్ స్థానికులు స్నేహ పూర్వకంగా ఉంటారు.



**ఆస్ట్రియా**

కళలు, సంస్కృతిని ఆస్వాదించడాన్ని ఇష్టపడేవాళ్లకు బెస్ట్ డెస్టినేషన్ ఆస్ట్రియా. సోలో ట్రిప్‌లకు కూడా ఈ దేశం చాలా అనుకూలంగా ఉంటుంది. ఇక్కడ ప్రజలు పర్యాటకులతో చక్కగా వ్యవహరిస్తారు. ఈ ప్రాంతంలో యువత ఎక్కువ. సాహస క్రీడలు ఇష్టపడేవారికి ఈ ప్రదేశం అద్భుతమైనది. ఆస్ట్రియాలోని ఎత్తయిన ప్యాలెస్‌లు, భవనాలు పర్యాటకులను ఆకట్టుకుంటాయి.



**ఐస్‌లాండ్**

సోలో ట్రావెలర్స్‌కి స్వాగతం చెప్పే సురక్షితమైన ప్రదేశాల్లో ఐస్‌లాండ్ ఒకటి. బయట ప్రదేశాల్లో ఉండటాన్ని ఆస్వాదించే వారికి ఇది అద్భుతమైన డెస్టినేషన్. ఇందులో అగ్నిపర్వతాలు, గ్లేసియర్ వాక్స్, గుహలు, జాతీయ ఉద్యానవనాలు ఉన్నాయి. గ్లోబల్ పీస్ ఇండెక్స్ సర్వే ప్రకారం ప్రపంచంలో అత్యంత ప్రశాంతమైన దేశంగా ఐస్‌లాండ్ నిలిచింది.



**జపాన్**

ఒంటరిగా ప్రయాణించే వాళ్లకు అన్ని విధాలుగా సరైన ప్రదేశం జపాన్ అని చెప్పవచ్చు. జపాన్ ట్రిప్ ప్లాన్ చేయడం చాలా సులభం. ద్వీపం నుంచి ప్రఖ్యాత బుల్లెట్ రైళ్ల వరకు అన్నీ ఆస్వాదించవచ్చు. ప్రపంచంలోనే అత్యంత సురక్షితమైన గమ్యస్థానాలలో ఒకటిగా జపాన్ గుర్తింపు పొందింది. ఇక్కడ నివసించే ప్రజల ప్రశాంతమైన, ఒత్తిడి లేని జీవన విధానం అందరినీ ఆకట్టుకుంటుంది. స్నేహపూర్వకమైన వాతావరణంతో మహిళా సందర్శకులు కూడా సోలోగా


ప్రయాణించవచ్చు. జపాన్ తన ప్రఖ్యాత నాగరికతకు పెట్టింది పేరు.

**మెక్సికో**



ఎప్పటి నుండో సోలో ట్రావెలర్స్‌కు మెక్సికో రొమాంటిక్ డెస్టినేషన్‌గా ఉంది. దీని వెనకాల కారణం కూడా ఉంది. ఇక్కడ ఒక్కరే ప్రయాణిస్తూ మరపురాని అనుభూతిని పొందడం చాలా సులభం. మెక్సికో కావలసిన అనుభూతులను అన్నింటిని అందిస్తుంది. అత్యంత గొప్ప సంస్కృతిని, ఆహ్లాదకరమైన వంటకాలను, ప్రపంచంలోని కొన్ని అత్యుత్తమ ప్రయాణ అనుభవాలను, స్నేహపూర్వక వ్యక్తులను పరిచయం చేస్తుంది. ఎక్కువ మంది మెక్సికన్ ఫుడ్ ఇష్టపడతారు.

**న్యూజిలాండ్**



ఒంటరిగా ప్రయాణిస్తున్నప్పుడు గొప్ప ఔటింగ్స్ ఆస్వాదించాలనుకుంటే న్యూజిలాండ్ సరైన ప్రదేశం. ఈ ప్రదేశంలో కొండల వైపు దృశ్యాలు ఆశ్చర్యపరుస్తాయి. న్యూజిలాండ్‌లో ఉన్నప్పుడు వర్షారణ్యాలు సందర్శించడం, తిమింగలాలను చూడటమే కాకుండా కొత్త సంగతులు మరిన్ని కనుగొనవచ్చు. ప్రపంచంలోని బెస్ట్ ఫుడ్ దొరికే ప్లేస్ ఇది. ఇక్కడి సంస్కృతి, సంప్రదాయాలు కూడా ఆకట్టుకుంటాయి.

**స్కాట్‌లాండ్**

స్కాట్‌లాండ్‌లోని సహజ సౌందర్యం



వర్ణించడం సాధ్యంకాదు. ఇది చూపరులను కట్టిపడేస్తుంది. ఈ ప్రాంతాన్ని సోలోగా ఎంజాయ్ చేయవచ్చు. అద్భుతమైన అనుభూతిని మిగుల్చుతుంది. సోలో వెకేషన్ వేడుకలకు అత్యంత సురక్షితమైన ప్రదేశం.



**స్విట్జర్లాండ్**



స్విట్జర్లాండ్ ఒంటరిగా సందర్శించినప్పుడు స్విస్ ట్రావెల్ పాస్ తప్పక తీసుకోవాలి. దీని సాయంతో బస్సులు, పడవలు, రైలు, ఇతర రవాణా మార్గాలలో అపరిమితంగా ప్రయాణించవచ్చు. ఇక్కడ అద్భుతమైన ప్రకృతి దృశ్యాలు, మనోహరమైన నగరాలు అన్వేషించడంతో సహా ఇక్కడ చేయవలసినవి, చూడవలసినవి చాలా ఉన్నాయి. స్విట్జర్లాండ్ మంచు పర్వతాలు ప్రత్యేకమైన ఆకర్షణ. అత్యంత రొమాంటిక్ ప్లేస్‌ల లిస్ట్ తీస్తే స్విట్జర్లాండ్ ముందు వరుసలో ఉంటుంది. షాపింగ్ ఇష్టపడేవారికి కూడా ఇది బెస్ట్ డెస్టినేషన్. ❑



కథ

# నిజమైన సంతృప్తి



రామనాథపురం గ్రామంలో రమణయ్య అనే ధనవంతుడు ఉండేవాడు. అతడు చాలా పిసినారి. పిల్లికి కూడా భిక్షం పెట్టేవాడు కాదు. వడ్డీవ్యాపారం చేసి ఎంతో డబ్బు గడించాడు.

రమణయ్య తాను సంపాదించిన డబ్బును ఒక భోషాణంలో పెట్టి భద్రపరిచాడు. నిరంతరం ఆ డబ్బు గురించి ఆలోచించేవాడు. భోజనం సరిగా తినేవాడు కాదు. రాత్రిపూట సరిగా నిద్ర పోయేవాడు కాదు. రోజు రోజుకు రమణయ్యకు మనశ్శాంతి లేకుండా పోయింది. ఏం చేయాలో పాలుపోవడం లేదు.

ఒకరోజు హిమాలయాల నుండి ఆ గ్రామానికి ఒక సన్యాసి వచ్చాడు.

రమణయ్య ఆ సన్యాసి దగ్గరకి వెళ్లి "నాకు ఎంత డబ్బు సంపాదించినా నిజమైన సంతృప్తి, ఆనందం లేదని" చెప్పాడు.

వెంటనే సన్యాసి "రమణయ్యా! నీవు సంపాదించిన డబ్బులో కొంత నీ అవసరాలకు ఉంచుకుని మిగిలిన డబ్బును పేదవారికి పంచమని" చెప్పారు.

"సరేనని" సన్యాసికి నమస్కరించి ఇంటికి వెళ్లాడు.

రమణయ్య తన దగ్గర ఉన్న డబ్బును ఆ గ్రామంలోని పేదలందరికీ పంచిపెట్టాడు. అప్పటినుండి కడుపునిండా తిని, కంటినిండా నిద్రపోతున్నాడు రమణయ్య.

ఒక సంవత్సరం తర్వాత గతంలో వచ్చిన సన్యాసి మళ్లీ గ్రామానికి వచ్చాడు. సన్యాసి వచ్చాడని తెలిసి రమణయ్య సన్యాసిని కలవడానికి వెళ్లాడు.

"ఎలా వున్నావని" సన్యాసి రమణయ్యను అడిగాడు.


"పరులకు సేవ చేయడంలోనే నిజమైన ఆనందం ఉందన్న విషయం" చెప్పి నా కళ్లు తెరిపించారని రమణయ్య అన్నాడు.

"నిజమైన జీవిత సత్యాన్ని తెలుసుకున్నావు రమణయ్యా. నీకంతా శుభమే జరుగుతుందని" దీవించాడు సన్యాసి.

సన్యాసి పాదాలకు నమస్కరించి రమణయ్య వీడ్కోలు తీసుకున్నాడు.

**- దాసరి చంద్రమోహన్**

## రంగులు వేయండి..








## బాలగేయం

### వేకువమ్మ



వేకువమ్మ లేచింది
తూర్పు వైపు నడిచింది
వెలుగుపూలు రువ్వింది
అందరినీ లేపింది
వాకిట్లో వాలింది
చీకట్లు తరిమింది
కాంతికిరణాలతో
చేయి కల్పి నడిచింది
అజ్ఞానం వీడమంది
విజ్ఞానం పొందమంది
జ్ఞానోదయమే కల్గి
తేజోమయం కమ్మంది
వేకువమ్మ లేకున్న
జగమంతా మబ్బులే!
తేకువ ఇక లేకున్న
మనుగడ కడు కష్టమే!

**- గద్వాల సోమన్న**



## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్

**గిరీష్ అంకుల్ సమాధానాలు**

**- కాంచన,** కనిగిరి

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. గ్రహశకలాలు భూ వాతావరణాన్ని మార్చగలవా?

**జవాబు: కాంచన!** మన భూ వాతావరణ పరిస్థితులను మార్చటంలో గ్రహశకలాలు ప్రముఖ పాత్ర పోషించాయని అమెరికాకు చెందిన పరిశోధకులు భావిస్తున్నారు. సుమారు 3.5 కోట్ల ఏళ్ల క్రితం ఈ గ్రహ శకలాలు వదిలి వెళ్లిన ధూళి వల్ల భూవాతావరణంలో మార్పులు వచ్చాయని వారు పేర్కొంటున్నారు. ఆ సమయంలో భూగ్రహంపై ఉష్ణోగ్రతలు చాలా తక్కువగా ఉండేవని పరిశోధనల్లో తేలింది. సరైన కోణంలో ఏదైనా గ్రహశకలం భూమిని తాకినపుడు భూవాతావరణం చుట్టూ ధూళి గుండ్రటి చక్రం మాదిరిగా ఏర్పడి ఉంటుందని శాస్త్రవేత్తలు అంటున్నారు. 3.5 కోట్ల ఏళ్ల క్రితం భూమిని ఏదో ఒక గ్రహశకలం వచ్చి ఢీకొందని, ఆ తర్వాత వాతావరణ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని అనడానికి కొన్ని ఆధారాలు సైతం లభించాయి.

**- కె.సుబ్రహ్మణ్యం,** మంథని

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. ఎలర్జీ ఎందువల్ల వస్తుంది?

**జవాబు: సుబ్రహ్మణ్యం!** ఫలానా పదార్థం తింటే ఎలర్జీ వచ్చిందని చాలామంది చెబుతుంటారు. మానసిక బలహీనతలు, మనోవేదనలతో బాధపడేవారికి ఎలర్జీ త్వరగా వస్తుంది. అనేకమంది తమకు 'ఇది పడదని', 'అది పడదని' చెప్పడం కూడా వాస్తవమే. 'ఎలర్జిన్' అనే ఒక రకమైన మాంసకృత్తి ఉంటుంది. ఇది నీటిలో, గాలిలో, ఆహారంలో ఎక్కడైనా ఉంటుంది. ఇది శరీరాన్ని తాకినా, లోపలికి ప్రవేశించినా, శరీర కణాలు భిన్న రీతిలో వ్యవహరించి కొన్ని అవలక్షణాలను కలిగిస్తాయి. ఈ పరిస్థితినే మనం 'ఎలర్జీ' అని అంటాం. ఎలర్జీ కారణంగా శరీరంలోని ఏ అవయవమైనా రుగ్మత పాలవచ్చు. చర్మం మీద దద్దుర్లు, వాపు, దురద, సన్నని మచ్చలు ఎరుపెక్కడం మొదలైన లక్షణాలు రావొచ్చు.








# శ్రీవైద్యనాధ జ్యోతిర్లింగ క్షేత్రం

ఆత్మస్వరూపినిగా పురాణాలు కీర్తించే సర్వేశ్వరుడు ఎన్నో పవిత్ర స్థలాలలో లింగ రూపంలో స్థిర నివాసం ఏర్పరచుకొని భక్తుల ప్రార్థనలను ఆలకిస్తున్నారు. పంచభూత స్థలాలు, పంచనాట్య సభలు, అష్ట వీరట్ట స్థలాలు, పంచారామాలు, పంచ క్రోశ ఆలయాలు, సప్త విదంగ క్షేత్రాలు, పంచ బ్రహ్మక్షేత్రాలు, సప్తస్థాన స్థలాలు, నవ నందులు, నవ కైలాసాలు.. ఇలా ఎన్నో!

ఇవన్నీ నయమ్మారులు గానం చేసిన తేవరాల ద్వారా పడాల్‌పెట్ర, తేవరవైప్పు స్థలాల్లో శాశ్వత స్థానం పొందినవే!

వీటన్నిటికన్నా హోదాలో స్థాయిలో ఉన్నవి ద్వాదశ జ్యోతిర్లింగాలు. కారణం.. ఆయా క్షేత్రాలలో స్వామి స్వయంభూగా ఉద్భవించడమే!

ఆరంభంలో బ్రహ్మ, విష్ణువులకు తామిద్దరిలో ఎవరు గొప్ప? అన్న సందేహం తలెత్తి వివాదంగా మారింది. ఆ వివాదం ముదిరి వాదులాటగా మారుతున్న సమయంలో ఇద్దరి మధ్యలో ఆద్యంతాలు లేని జ్యోతి ఒకటి వెలిసింది. తన మూలాన్ని గానీ, లేక తన పై భాగాన్ని కానీ ఎవరు దర్శించుకొని ముందుగా వస్తారో వారే గొప్ప అని తెలిపింది జ్యోతి. శ్రీహరి వరాహ రూపం ధరించి పాతాళంలోకి వెళ్లగా; విధాత తన హంస వాహనం మీద గగనతలంపైకి ఎగిరి వెళ్లాడు. ఇద్దరికీ తమ గమ్యాలను చేరడం సాధ్యం కాలేదు. శ్రీమన్నారాయణుడు తిరిగి వచ్చి తన ఓటమిని ఒప్పుకొన్నారు.

కానీ కమలాసనుడు తాను జ్యోతి అగ్ర భాగాన్ని చూసానని సాక్ష్యంగా మొగలిపువ్వును చూపారు. ఆగ్రహించిన కపర్ది భూలోకంలో సృష్టికర్తకు భూలోకంలో పూజార్హత లేదని, మొగలిని పూజకు పనికిరాని పువ్వు అని శాపం ఇచ్చారు. విధాత, శ్రీహరి, సకల దేవతల, మహర్షుల, మునుల కోరిక మేరకు పరమేశ్వరుడు పర్వత రూపంలో భువిలో స్థిర నివాసం ఏర్పరచుకొన్నారు. అదే తిరువణ్ణామలై (అరుణాచలం).

అనంత కాలంలో ప్రత్యేక కారణాలతో మహేశ్వరుడు జ్యోతి రూపంలో సాక్షాత్కరించి వెలసిన కొన్ని స్థలాలను జ్యోతిర్లింగ క్షేత్రాలుగా నిర్ణయించారు. గతంలో అవి అరవై నాలుగుగా ఉండేవట. కలియుగానికి పన్నెండుగా మిగిలినట్లు తెలుస్తోంది. వీటినే ద్వాదశ జ్యోతిర్లింగాలు అని పేర్కొన్నారు. అవి: సోమనాథ్ (గుజరాత్), శ్రీశైలం (ఆంధ్రప్రదేశ్), మహాకాళేశ్వరం (ఉజ్జయిని, మధ్యప్రదేశ్), ఓంకారేశ్వర్ (మధ్యప్రదేశ్), కేదారనాథ్ (ఉత్తరాఖండ్), భీమేశ్వరం (పూణే, మహారాష్ట్ర), వారణాశి (ఉత్తరప్రదేశ్), త్రయంబకేశ్వరం (నాసిక్, మహారాష్ట్రం), నాగేశ్వరం (ద్వారక, గుజరాత్), రామేశ్వరం (తమిళనాడు), ఘృశ్నేశ్వరం (మహారాష్ట్ర), వైద్యనాథ్ ధామం (దేవఘర్-ఝూర్ఖండ్).

మిగిలిన పదకొండు క్షేత్రాలలో లేని సందిగ్ధ పరిస్థితి వైద్యనాథ్ ధామం స్థల నిర్ణయం విషయంలో నెలకొని ఉంది. మహారాష్ట్ర లోని పర్లిలో వున్న ఆలయాన్ని కూడా వైద్యనాథ్ ధామంగా పిలుస్తారు. దానినే ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటని స్థానికులు వాదిస్తారు. అయితే శివపురాణం, భవిష్య పురాణం, మత్స్య పురాణం, దేవీ భాగవతంతో పాటు జగద్గురు శ్రీశ్రీశ్రీ ఆదిశంకరులు రచించిన శ్లోకాల ఆధారంగా ఝూర్ఖండ్‌లో ఉన్నదానినే సరైన ఆలయంగా నిర్ణయించడం జరిగింది. హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రం లోనూ మరో వైద్యనాథ్ ఆలయం ఉండటం విశేషం. అక్కడివారు దానిని ద్వాదశ లింగ రూపంగా భావిస్తారు. ద్వాదశ జ్యోతిర్లింగాలలో భాగం కాకపోయినా ఈ రెండూ మహిమాన్విత క్షేత్రాలే! ఝూర్ఖండ్, మహారాష్ట్రలలోని రెండు ఆలయాల పురాణ గాథ ఒకటే కావడం మరో విశేషం.

పరమేశ్వరుని ప్రసన్నం చేసుకొని ఆయన ను తన లంకకు తీసుకొని వెళ్లాలని తలచాడు లంకేశ్వరుడు రావణుడు. తన కోరిక నెరవేరడం కోసం భీకరమైన తపస్సు చేసాడు. చివరి ప్రయత్నంగా తన తలలను ఒక్కొక్కటిగా అగ్నికి సమర్పించాడు.
భక్తసులభుడు కరునించి దిగి వచ్చి స్వయంగా శిరస్సులను అతికించి అతనిని సజీవుని చేసారు. ఈ కారణంగా స్వామిని 'వైద్యనాథుడు' అని పిలుస్తారు.
"తాను లంకలో ఉండటం సాధ్యం కాదు అనీ, తన బదులు తన ఆత్మలింగం తీసుకొని వెళ్లమని" ఆత్మలింగం ప్రసాదించారు. ఆత్మలింగం లంకకు చేరితే సంభవించే పరిణామాలను గురించి భయాందోళనలకు గురవుతున్న దేవతలు పంపగా మారు వేషంలో బాలకునిగా వచ్చింది విఘ్ననాయకుడే! బాలకుడు ముందుగానే చెప్పిన విధంగా రావణుణ్ణి మూడుసార్లు పిలిచి, లింగాన్ని నేల మీద ఉంచి మాయమైపోయాడు పార్వతీనందనుడు.
ఎంత ప్రయత్నించినా కదిలించలేకపోయిన రావణుడు నిరాశగా వెళ్లిపోయాడు.
పెద్ద ముప్పు తప్పినందుకు కీర్తించిన దేవతలకు, మునులకు జ్యోతి రూపంలో దర్శనం ప్రసాదించి వారి కోరిక మేరకు అక్కడే స్థిర నివాసం ఏర్పరకొన్నారు లింగరాజు.
దేవతల ఆదేశం ప్రకారం దేవశిల్పి విశ్వకర్మ తొట్టతొలి ఆలయాన్ని నిర్మించారు. గర్భాలయ కాల నిర్ణయం నేటికీ చేయలేకపోవడం, ఎలాంటి మార్పులూ చేయలేకపోవడం దానికి నిదర్శనాలుగా చెబుతారు. (కర్నాటకలోని ప్రసిద్ధ శైవ క్షేత్రం 'గోకర్ణం' కథ కూడా ఇదే కావడం ప్రత్యేకంగా చెప్పుకోవాలి)
తదనంతర కాలంలో ఎన్నో స్థానిక రాజ వంశాలవారు ఆలయ అభివృద్ధికి విశేష కృషి చేసారని లభించిన ఆధారాల ద్వారా తెలుస్తోంది.
ముఖ్యంగా "గిధవుర్" వంశ రాజు "రాజా పురాణ సింగ్" ప్రస్తుత ఆలయాన్ని నిర్మించినట్లుగా చెబుతారు.
నివాస, వ్యాపార సముదాయాల మధ్యన ఉన్న ఈ ఆలయ ప్రాంగణంలో ప్రధాన ఆలయంతో పాటు మరో ఇరవై ఒక్క ఆలయాలు ఉంటాయి.
వైద్యనాథ్ ధామ ప్రత్యేకత ఏమిటంటే ఇది యాభై ఒక్క శక్తి పీఠాలలో ఒకటిగా గుర్తింపు పొందింది.
దక్ష యజ్ఞం సంరంభానికి పిలవని పిలుపుగా పుట్టింటికి వెళ్లిన సతీదేవి అవమానానికి గురై యజ్ఞగుండంలో దూకి ప్రాణత్యాగం చేసింది. దక్ష యజ్ఞాన్ని భగ్నం చేసిన తరువాత సర్వేశ్వరుడు సతీదేవి శరీరాన్ని భుజాన వేసుకొని విరాగిగా తిరగసాగారు.
లయకారుని తిరిగి ఇలలోకి తేవడానికి శ్రీ మహావిష్ణువు సుదర్శన చక్రంతో సతీదేవి శరీరాన్ని ఖండించారు. ఆ శరీర భాగాలు భువిలోని వివిధ ప్రాంతాలలో పడ్డాయి. అవే శక్తిపీఠాలుగా పేరొందాయి.
వైద్యనాథ్ ధామం కాకుండా జ్యోతిర్లింగాలతో పాటు శక్తిపీఠాలుగా గుర్తింపు పొందిన క్షేత్రాలు వారణాశి, శ్రీశైలం.
ఇక్కడ అమ్మవారి హృదయ భాగం పడింది. అందువల్ల గతంలో "హార్దపీఠం" గా పిలిచేవారు.



శ్రీ జయదుర్గాదేవి అమ్మవారి ఆలయం శ్రీ వైద్యనాథ స్వామి ఆలయానికి ఎదురుగా ఉంటుంది. అర్ధనారీశ్వర తత్వానికి ప్రతిరూపమైన శివశక్తి స్వరూపాలను కలపాలన్న తలంపుతో భక్తులు తమ కోరిక నెరవేరిన తరువాత ఎఱ్ఱని దారాలతో రెండు ఆలయాలను అనుసంధిస్తారు.
పూర్వకాలంలో ఈ క్షేత్రం తంత్ర సాధకులకు నిలయమని చెబుతారు. ఎందరో ఇక్కడ సాధన చేసి దివ్య శక్తులను పొందారని తెలుస్తోంది. ఈ కారణంగా కాబోలు.. ప్రాంగణంలోని ఉపాలయాలలో దేవీ రూపాలవే ఎక్కువగా కనిపిస్తాయి.
గణపతి, నవదేవర, గౌరీశంకర, తార, కాళీ, అన్నపూర్ణ, బ్రహ్మా, సంధ్య, భైరవ, హనుమాన్, మానస, సరస్వతి, సూర్యనారాయణ, బంగ్లా, శ్రీరామ సీత, ఆనంద భైరవ, గంగా, లక్ష్మీనారాయణ, నీలకాంత, పార్వతి, జగజ్జననీ ఉపాలయాలలో కొలువుతీరి ఉంటారు.
ప్రాంగణ ఈశాన్య భాగంలో ఉన్న "చంద్రకూప"గా పిలవబడే మంచి నీటిబావి జలాన్నే స్వామివారి అభిషేకాలకు వినియోగిస్తారు.
ప్రతిరోజూ దేశంలోని అన్ని ప్రాంతాల నుండి వేలాదిగా భక్తులు తరలివస్తారు. శ్రీ వైద్యనాథుని అభిషేకించి ఆనంద పరవశులవుతారు. ముఖ్యంగా ఆదివారాలు, సోమవారాలు, భక్తుల సంఖ్య విపరీతం. శివరాత్రి, ఆరుద్ర నక్షత్రంరోజున, అమావాస్య, పౌర్ణమి, మాస శివరాత్రి రోజులలో విశేష అభిషేకాలు నిర్వహిస్తారు
మనం కార్తిక మాసాన్ని శివునికి ప్రియమైన మాసంగా ఎలా భావిస్తామో ఉత్తర భారతంలో శ్రావణ(జులై-ఆగస్టు) మాసాన్ని శంకర సేవకు తగిన సమయంగా పరిగణిస్తారు.
ఇక్కడికి వంద కిలోమీటర్ల దూరంలో వున్న సుల్తాన్‌గంజ్ దగ్గర గంగలో స్నానమాచరించి, ప్రత్యేక దీక్ష బూని చెంబులలో గంగా జలాన్ని తీసుకొని కావడిలో అమర్చుకొని కాలినడకన వైద్యనాథం చేరుకొనే భక్తులు భక్తి పారవశ్యాలతో పవిత్ర జలంతో పరమేష్టిని అభిషేకిస్తారు.
ఈ బోల్‌బమ్ ఉత్తరాది రాష్ట్రాలలో ప్రతి ఊళ్లో అత్యంత భక్తి శ్రద్ధలతో పాటిస్తారు. అయితే చాలా చోట్ల సమీపంలోని ఈశ్వరాలయానికి వెళతారు. ఝార్ఖండ్, బీహార్, ఒడిస్సా, పశ్చిమ బెంగాల్ వాసులు మాత్రం అధిక సంఖ్యలో వైద్యనాథ్ ధామం వెళతారు. శ్రావణ మాసమంతా వైద్యనాథంలో ఆధ్యాత్మికతతో కూడిన పండుగ వాతావరణం నెలకొంటుంది.
ఇలా చేరుకోవచ్చు..
ఝార్ఖండ్ రాష్ట్రంలో దేవ్‌ఘర్ పట్టణంలో ఉన్న ఈ ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం దేశంలోని అన్ని పట్టణాల నుండి రైలు మార్గంలో చేరుకోవచ్చు. దేవ్‌ఘర్ పట్టణంలో "వైద్యనాథ్ ధాం" అన్న పేరుతో రైల్వే స్టేషన్ ఉంది.
అయితే ఇక్కడికి అతి తక్కువ సంఖ్యలో రైళ్లు ఉన్నాయి. ఇక్కడి నుండి వైద్యనాథ్ ధామం చేరుకోవడానికి దేవ్‌ఘర్ పట్టణానికి ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న 'జసిది' రైల్వే స్టేషన్ అన్ని విధాలుగా అనుకూలం గా ఉంటుంది. దేశం నలుమూలల నుండి జసిది చేరడానికి రైళ్లు ఉన్నాయి.

**- ఇలపావులూరి వెంకటేశ్వర్లు**

# ఖిలునకు నిలువెల్ల విషము

కథ

గన్నవరపు నరసింహామూర్తి

కార్తిక మాసం.. ప్రత్యూషవేళ..
ఉదయాన్నే ఆరు గంటలకి నేను పొలానికి బయలుదేరాను.
మా ఇంటికి మా పొలం రెండు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది.
దారంతా హరితపు వర్ణపు వరి చేలు.. దీపావళి వెళ్లిపోయింది కాబట్టి కొన్ని చేలు పసుపు వర్ణంలోకి మారుతూ కంటికింపుగా కనిపిస్తున్నాయి.
తూరు సంధ్య అప్పుడే సింధూరంలోకి మారుతోంది.
ఆకాశంలో మల్లెదండల్లా పక్షుల గుంపులు..
దూరంగా ఏటి ఒడ్డున తోటల్లోంచి కోకిల కలకూజితాలు.
ఒక పొలం నుండి ఇంకొక పొలంలోకి గలగలమని శబ్దం చేస్తూ పారుతున్న నీరు.. వరికంకుల మీద తెల్లటి నీహారికా



బిందువులు..
వాతావరణం చాలా ఆహ్లాదకరంగా ఉంది..
అందుకే నేను ఈ సమయంలో పొలానికి వెళ్తుంటాను.
చదివింది ఏజీ బీయస్సీ అయినా ఉద్యోగానికి వెళ్లకుండా వ్యవసాయంలోకి దిగడంతో నాన్నకి నా మీద కోపం.
"లేక లేక పుట్టినవాడు మనతో ఉంటానంటే సంతోషించక కోపం ఎందుకని" నాన్నతో చెబుతుంటుంది అమ్మ. ఎంతైనా అమ్మ కదా.
జీవితంలో నేనెక్కడవెనకపడిపోతానేమోనని నాన్న భయం.
కొద్దిసేపటికి పొలం చేరుకున్నాను.
అప్పటికే మా రైతు సీతన్న అక్కడ పొలానికి నీళ్లు పెడుతూ కనిపించాడు.
వాడు వ్యవసాయ పనుల్లో నాకు సహాయం చేస్తుంటాడు.
అతనికిక్కడ ఓ ఐదెకరాల పొలం ఉంది.
తండ్రీ, కొడుకు రావుడూ రోజూ చాలా కష్టపడుతుంటారు.
ఏరు మా ఊరు పక్క నుంచి పారుతున్నా ఊరు ఎత్తులో ఉండటం వల్ల మా పొలాలకు ఏటి వల్ల ఏ ఉపయోగం లేదు.
అందుకని నేను మా పొలంలో రెండు ట్యూబ్‌వెల్స్ తవ్వించి పైపులు అన్ని మళ్లకూ పెట్టించాను. కాబట్టి నీటి సమస్య లేదు.
మా పొలాలకు ఎగువ పెద్ద చెరువు ఉంది. దాని నీళ్లే మా రైతులు వాడుతుంటారు. సీతన్న పొలానికి అప్పుడప్పుడు ఆఖరి తడికి నీళ్లు చాలకపోతే మా బోరు నుంచి నీరిస్తుంటాను.
మాకున్న ఇరవై ఎకరాల్లో ఓ ఐదెకరాల్లో చెరకు వేస్తుంటాను.
నేను వెళ్లేసరికి సీతన్న కర్ర పట్టుకొని పొలం మధ్య బట్టిలో దేన్నో వెతుకుతున్నాడు.
"ఏంటి సీతన్నా! ఏమైంది?" అని అడిగాను.
పెద్ద పాము బాబూ.. నాగుపాములా ఉంది. నా కాళ్ల మధ్య నుంచి ఎళ్లిపోనాది. కన్ను ఏమారితే నన్ను పొడిచేసి ఉండేది" అన్నాడు కర్రతో గడ్డిని కొడుతూ.
అందుకే బూట్లు వేసుకోమంటాను. టార్చిలైట్ లేకుండా అంత చీకట్లో ఎందుకు రావటం చెప్పు. పొలంలో పాము నుంచి రెండోసారి తప్పించుకున్నావు కదూ" అన్నాను.
"రెండోపాలి కాదు ఇది మూడోపాలి. అయినా బాబూ సిన్నప్పట్నుంచీ ఈ పొలానికి ఒత్తున్నాను. ఎన్నో మార్లు పాములు కనిపిత్తుంటాయి. అవేటి సేత్తాయి.. కానీ నా భయమంతా మావోడి గురించే. ఆడు దుడుకు మనిషి. జాగరత్త గుండాలని ఆడికి సెప్పాలి" అన్నాడు సీతన్న.
నా చిన్నప్పట్నుంచీ చూస్తూనే ఉన్నాను. మా పొలాల్లో ఎన్నో పాములు.. ఎక్కువగా నాగుపాములు.. వరిపొలాల్లో ఎలకల కోసం వస్తుంటాయి. ఇక చెరుకుపొలాల్లో అయితే ఉల్లిపాయలు.. అవి మరీ ప్రమాదం. అవి కరిస్తే మనిషి కుళ్ళి కుళ్ళి చనిపోతాడు.
పాములంటే నాకూ భయమే. పదేళ్ల క్రితం మా ఊరి సర్పంచ్ తవుడి కొడుకు శివుణ్ణి చెరుకు పొలంలో ఉల్లిపాము కరిస్తే నలభై రోజులు మంచం పట్టి చివరకు పాదం కుళ్ళిపోయి ఒళ్లంతా మచ్చలొచ్చి చనిపోయాడు.
ఇంకోసారి సీతన్న అన్న కొడుకుని నాగుపాము కరిచింది కానీ అదృష్టవశాత్తూ బతికేడు.
చిన్నప్పుడు మా నాన్న పాములుంటాయని నన్ను పొలానికి వెళ్లొద్దనీ కోప్పడేవాడు. కానీ నేను వినేవాణ్ణి కాదు. మొత్తానికి రైతులకు ఈ పాములు ఓ పెద్ద సమస్య. అయినా తప్పదు. ఒక విధంగా చెప్పాలంటే

పాము రైతులకు మిత్రుడని చెబుతారు. ఎలుకలు పొలం గట్లకు బొంగలు పెడుతూ నీటిని బయటకు వదిలేస్తుంటే వాటిని మింగేసి పాములు రైతులకు సహాయం చేస్తుంటాయి కాబట్టి అవి రైతులకు మిత్రులంటారు పెద్దలు."బాబూ! ఈ యిసయం ఇంటికాడ తెలిస్తే నన్ను పొలానికి ఎల్లనివ్వరు. మొన్న మా పెరట్లో దొండపాదు దగ్గర దొండకాయలు తెంపుతుంటే పెద్ద పాము కనిపించింది. అప్పట్నుంచీ పామంటే భయం ఎట్టేసుకున్నారు మావోళ్లు. అందుకే ఈ పొలి ఈ పాముల్ని వొదలను. ఈటిని సంపితీరుతాను. అప్పుడే పొలంలో భయం లేకుండా తిరగొచ్చు" అన్నాడు కర్ర తిప్పుతూ.

"సీతన్నా! ఈ సృష్టిలో అన్ని జీవులూ అవసరమే. అలాగే పాములు కూడా. వాటిని నాశనం చెయ్యాలనుకోవడం తప్పు. అయినా ఎన్నిటిని నాశనం చేస్తావు చెప్పు? వాటి పని వాటిని చెయ్యనీ. మన జాగ్రత్తలో మనం ఉండాలి" అన్నాను వాడితో.
మరో అరగంట తరువాత చీకటి పడటంతో నేను, సీతన్నా ఇంటికి బయలుదేరాం.


...

రెండు రోజుల తరువాత నేను మళ్లీ పొలానికి వెళ్లినప్పుడు సీతన్న సర్పంచ్ కొడుకు తవుడుతో తగువు పడుతూ కనిపించాడు.
నన్ను చూసి నా దగ్గరకి వచ్చాడు సీతన్న.
"ఏం జరిగింది" అన్నాను.
"బాబూ! వొరిసేను పొట్ట మీద ఉంది కదా. దానికి పుట్టెడు నీరు కావాల. అందుకే నిన్న సెరువులోని నీరుని పొలానికి ఎట్టినాను. ఫర్లాంగు దూరం బట్టి సరిగ్గా నేకపోతే కట్టపడి నేనూ మా రావుడూ బట్టిని బాగు చేత్తే కానీ నీరు రానేదు. కానీ ఈ పకీరుగాడు నిన్న రాతిరి మా పొలం గట్టుని తవ్వీసి నీటిని ఆడి పొలానికి ఎట్టేసుకున్నాడు. సూడండి మా పొలంలోని నీరంతా ఆడి పొలానికి పోనాది. ఇంక మాకు పంటేటి పండుతాది" అన్నాడు కోపంగా.
సీతన్న మాటలు విని పకీరు కూడా వేగంగా నా దగ్గరకొచ్చి "ఆడి మాటలు నమ్మకండి బాబూ.. నానేటీ ఆళ్ల నీటిని ముట్టుకోనేదు. మా బట్టి నీరే మా పొలానికి ఎట్టేను" అన్నాడు పకీరు.
నేను ఇద్దర్నీ తీసుకొని పొలం గట్టు దగ్గరకు వెళ్లాను. అక్కడ పారతో తవ్వినట్లు ఉంది. దాని ద్వారా సీతన్న పొలం నీరు పకీరు పొలంలోకి వెళ్లిపోయినట్లు జాడ కనిపిస్తోంది. ఆ గట్టుని చూడగానే పకీరుదే తప్పనీ నాకర్థం అయింది.
"పకీరూ! ఈ గట్టుని ఎందుకు తవ్వావు?" అని అడిగాను.
"నాను తవ్వనేదు. అదెప్పట్నుంచో ఉన్నాది" అన్నాడు వాడు.
"పకీరూ! నువ్వు అబద్ధం ఆడుతున్నావు. ఈ గట్టుని రాత్రే తవ్వినట్లు కనిపిస్తోంది. సీతన్న వాడి గట్టుని వాడే తవ్వుకోడు కదా. ఇటువంటి పనులు ఎప్పుడూ చెయ్యకు. సీతన్న కాబట్టి సరిపోయింది. అదే రావుడు చూస్తే పెద్ద గొడవ జరిగి ఉండేది. ఇంకెప్పుడూ ఇలాంటి పని చెయ్యకు లేకపోతే మీ అయ్యకు చెబుతాను" అన్నాను కోపంగా.
వాడు నా వైపు కోపంగా చూసి వెళ్లిపోయాడు.
ఆ మర్నాడు సీతన్న కొడుకు రావుడికి ఈ విషయం తెలిసి పకీరుతో గొడవ పెట్టుకున్నాడు.
పకీరు నోరు జారడంతో రావుడు కోపంతో కర్రతో గట్టిగా కొట్టాడు. అలా ఆ గొడవ ముదిరి పెద్దదైంది. ఆ తరువాత ఆ తగువు పంచాయితీ దాకా వెళ్లింది. తనను రావుడు పొలంలో కర్రతో కొట్టాడని పకీరు వాడి తండ్రి సర్పంచ్ రామునాయుడికి ఫిర్యాదు చేసాడు. నాయుడు పంచాయితీ పెట్టి సీతన్ననీ రావుడినీ పంచాయితీకి పిలిచారు. నన్ను సాక్షిగా పిలిచారు.
సీతన్న జరిగిన విషయం చెబితే పంచాయితీ సభ్యులు వాడి మాట వినలేదు.
అప్పుడు నేను పకీరుదే తప్పని లిఖితపూర్వకంగా సాక్ష్యం చెప్పేను. నా సాక్ష్యం వల్ల పకీరుకి వెయ్యి రూపాయల జరిమానా వేసింది పంచాయితీ.
కానీ రెండు రోజుల తరువాత ఊరిలో అగ్గి రాజుకుంది. సర్పంచ్ రామునాయుడు వర్గం కోపంతో రగిలిపోయి సీతన్న కులంవాళ్ల మీద దాడులు చేయడం మొదలుపెట్టారు. ఆరు నెలల క్రితం పంచాయితీ ఎన్నికలప్పుడు ఊళ్లో రెండు వర్గాల మధ్య బోలెడు గొడవలు జరిగి పోలీసు కేసులదాకా వెళ్లాయి. ఇప్పటికీ ఆ కేసుల కోసం రెండు వర్గాల వాళ్లు పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. ఇంకా ఆ కోపాలు చల్లారలేదు. మళ్లీ ఈ తగువు. పంట కోతకొచ్చే కార్తికంలో నీటి

"పకీరూ! ఈ గట్టుని ఎందుకు తవ్వావు?" అని అడిగాను. "నాను తవ్వనేదు. అదెప్పట్నుంచో ఉన్నాది" అన్నాడు వాడు. "పకీరూ! నువ్వు అబద్ధం ఆడుతున్నావు. ఈ గట్టుని రాత్రే తవ్వినట్లు కనిపిస్తోంది. సీతన్న వాడి గట్టుని వాడే తవ్వుకోడు కదా. ఇటువంటి పనులు ఎప్పుడూ చెయ్యకు. సీతన్న కాబట్టి సరిపోయింది.

## కార్టూన్లకు ఆహ్వానం

కార్టూనిస్టుల నుండి ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని కార్టూన్ల తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి.
కార్టూన్లు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-500 080. sunmagvaartha@gmail.com




తగవులు మా ఊళ్లో మామూలే అయినా పకీరు మాత్రం నీటి విషయంలో తప్పుడు పనులు చేస్తూ గొడవలకు ఆజ్యం పోస్తుంటాడు. ఎంతైనా సర్పంచ్ కొడుకునని వాడికి తలబిరుసెక్కువ. వెయ్యి రూపాయల జరిమానా పకీరు కట్టలేదు సరికదా.. మర్నాడు మా పక్క ఊరి పోలీస్‌స్టేషన్‌కి వెళ్లి రావుడి మీద, సీతన్న మీద కేసులు పెట్టాడు. దాంతో వోడిపోయిన సర్పంచ్ పోలినాయుడు వర్గం కూడా రావుడి చేత పకీరు మీద హత్యానేరం కింద ఎదురు కేసు పెట్టించింది.

ఇప్పుడు ఊరు రెండుగా చీలిపోయింది. ఊళ్లో తరుచూ తగువులు జరుగుతున్నాయి.
రెండు వర్గాలు భయం భయంగా గడుపుతున్నారు. ఇప్పుడు ఊళ్లో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేసారు.
ఒకరోజు నేను పొలానికి వెళ్తున్న సమయంలో మా సర్పంచ్ రామునాయుడు వచ్చాడు.
"నాయుడూ! ఆ రోజు నీ కొడుకు పకీరు తప్పు చేశాడు. నేను చెబితే మీరు నమ్మలేదు. దాని వల్ల ఎన్ని గొడవలో చూడు.
ఇప్పుడు సగం మంది మనవాళ్లు పోలీసు స్టేషన్ చుట్టూ, కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు.. వాళ్లు కష్టపడి సంపాదించుకున్న డబ్బంతా పోలీసులు, లాయర్ల పాలైంది. దీని వల్ల ఏం సాధించేరు చెప్పు?" అనడిగాను కోపంగా.
"బాబూ! మావోడు తప్పు చేసాడని నాకూ తెలుసు. కానీ ఆ ఎదవకి బుద్ధి నేదు. ఏదైనా అంటే మీద పడిపోతాడు. ఆడు మూర్ఖుడు, సదువుకోనేదు. అందుకే అలా తయారైనాడు" అన్నాడు నాయుడు.
"ఇంక గొడవలు ఆపండి. లేకపోతే మనం సంవత్సరాల నుండి కష్టపడి సంపాదించనదంతా కోర్టుల పాలౌతుంది. పిట్టపోరు పిట్టపోరు పిల్లి తీర్చినట్లు మీ గొడవల వల్ల పోలీసులు బాగుపడతారు. కలిసి ఉంటేనే పల్లెలు బాగుపడతాయి. లేకపోతే అందరూ పాడైపోతారు. నువ్వు సర్పంచ్‌వి. ఊళ్లో అందర్నీ సమానంగా చూడాలి. రేపు ఊళ్లో మీటింగ్ పెట్టి కేసుల్ని వెనక్కి తీసుకోమని చెప్పు. నేను ఇన్‌స్పెక్టర్ గారితో మాట్లాడుతాను" అన్నాను.
"తప్పకుండా బాబూ! రేపే ఎల్లి కేసుల్ని వాపసు తీసుకుంటాం. సీతన్న గోరికి మీరు సెప్పండి" అన్నాడు నాయుడు.
ఆ మర్నాడు రెండు వర్గాలు వెళ్లి కేసుల్ని ఉపసంహరించుకోవడంతో ఊళ్లో మళ్లీ ప్రశాంతత నెలకొంది.

...

ఆ రోజు నేను పొలానికి ట్రాక్టర్ మీద వెళ్లాను. అప్పుడప్పుడు మా డ్రైవర్ లేనప్పుడు దాన్ని నడుపుకుంటూ వెళ్లడం నాకు అలవాటే.
పొలంలో సీతన్న, రావుడు కనిపించారు.
"ఏం సీతన్నా! పాములింకా కనిపిస్తున్నాయా?" అని అడిగాను.
"ఇప్పుడాటి గురించి ఆలోచించడం నేదు బాబూ. పాముల కన్నా యిసం మన మదుసుల్లోనే ఉంది. మనకన్నా పాములే నయం. అవి ఆటి నేటైనా సేత్తేనే కరుత్తాయి. కానీ మన దొంగనా కొడుకులు ఏటీ సెయ్యకుండానే మన ఎనక గోతులు తవ్వుతారు. అందుకే పాములంటే భయం పోనాది. అవేటీ సెయ్యవు" అన్నాడు సీతన్న.
"రావుడూ, ఇంకెప్పుడూ ఎవ్వరితోనూ గొడవలు పెట్టుకోవద్దు. అన్యాయం చెయ్యాలనుకున్నవాడు చివరికి పకీరులా చెడిపోతాడు" అన్నాను.
ఆ తరువాత వాళ్లిద్దరూ ఇంటికి వెళ్లిపోయారు.
ఆ సమయంలో నాకెందుకో "ఖలునకు నిలువెల్ల విషము తథ్యము సుమతీ" అన్న సుమతీ శతకంలోని పద్యం గుర్తుకు వచ్చింది. ❑

ఎంతైనా సర్పంచ్ కొడుకునని వాడికి తలబిరుసెక్కువ. వెయ్యి రూపాయల జరిమానా పకీరు కట్టలేదు సరికదా.. మర్నాడు మా పక్క ఊరి పోలీస్‌స్టేషన్‌కి వెళ్లి రావుడి మీద, సీతన్న మీద కేసులు పెట్టాడు.


## రచనలకు ఆహ్వానం

రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం.
రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి.
ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి.
ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు పంపించకండి.
రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396,
లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.
sunmagvaartha@gmail.com

# మహాయోగి వేమన


**తెలుగు** సాహిత్యంలో ఆది కాలంలో తిక్కన, మధ్య కాలంలో వేమన, ఆధునిక యుగంలో గురజాడ.. ముగ్గురూ త్రిమూర్తులైన కవిత్రయంగా శ్రీశ్రీ పేర్కొన్నారు. సరళ సుందరమైన తెలుగుతనం ఉట్టిపడే ప్రజాకవి వేమన పుట్టుపూర్వోత్తరాల గురించి తెలిసిన చరిత్ర తక్కువ. ఆయన జీవిత విశేషాల గురించి ఎన్నో ఊహలు, అపోహలు ప్రచారంలో వున్నాయి.

వేమన జీవితమంతా అన్వేషణల అనుభవాలతో తత్వవేత్తగా, ద్రష్టగా, బోధగా తీర్చిదిద్దింది. భేషజాలు, ఆడంబరాలు, మూర్ఖభావాలను వేమన పద్యాలు ఎదిరించాయి. ఎటువంటి ముసుగులు లేని జ్ఞాన సత్యాలుగా వేమన పద్యాలు సంఘాన్ని, భగవంతున్ని కూడా నిలబెట్టి ప్రశ్నించాయి. వేమన పండితుడు కాదు. వేదాలు చదవలేదు. సుఖ దుఃఖాలను అనుభవించిన సామాన్య మానవునిగా అద్వైతిగా, విరక్తితో సంచరిస్తూ సమాజంలోని జనహితాన్ని ఆకాంక్షించారు.

'విశ్వదాభిరామ వినురవేమ' మకుటంతో వేమన పద్యాల ఆధారంగా జన్మస్థలం రాయలసీమలోని కొండవీడు అని తెలుస్తోంది. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, కొమర్రాజు వెంకట లక్ష్మణరావు, వంగూరి సుబ్బారావు, బండి గోపాలరెడ్డి(బంగోరె), ఆరుద్ర, మల్లంపల్లి సోమశేఖర శర్మ, ఎన్.గోపీ, కట్టమంచి రామలింగారెడ్డి, వి.ఆర్.నార్ల వంటి సాహితీవేత్తలు, పరిశోధకులు ఎందరో మేధావులు అనంతరం వేమన జీవితం, పద్య సాహిత్యంపై వెలుగులు ప్రసరింపచేసారు.

నేటి సామాజిక పరిస్థితులలో కూడా వేమన పద్యాలు కాలానికి అతీతంగా ప్రశ్నిస్తూనే వుండే శాశ్వత విలువలు కలిగి వున్నాయి. తెలుగునాట సామాన్య గ్రామీణులు, పామరులు ఆశువుగా, అలవోకగా వేమన పద్యాలను గుర్తు చేసుకొంటూ వుంటారు. తెలుగు జనావళి నాలుకలపై నాట్యమాడుతూనే వుంటాయి. తాటాకులపై లిఖిత సాహిత్యంగా కాకుండా ప్రజా హృదయాలను ఆకట్టుకొని, జన జీవన వ్యవహారాలలో దైనందినంగా మార్గదర్శకం చూపిస్తూనే ఉంటాయి.

వేమన పద్యాలలో అస్పష్టత, సందిగ్ధత వుండదు. ఎంత జటిలమైన విషయమైనా సూక్ష్మంగా, సులభంగా, సూటిగా జన హృదయాలను స్పృశిస్తాయి. అప్రయత్నంగా, అలవోకగా నిలదీసే శక్తివంతంగా వ్యవహార జ్ఞానం



కలిగిస్తాయి. తెలుగులో నీతులు, ధర్మాలు, చమత్కారం, వ్యాఖ్యానం, విమర్శ, హేతువాద భావనలు, అన్ని వ్యవస్థల లొసుగులు, మానవ జీవిత విలువలు పతనం దృష్టిలో పెట్టుకొని సంప్రదాయంపై నైతిక ధ్వజం ఎత్తిన జ్ఞానయోగి వేమన.

పిండములను చేసి పితరుల దలపోసి కాకులకు పెట్టే సంప్రదాయ ఆచారాలకు ఎదురు తిరిగి ప్రశ్నించిన వేమన, సమకాలికులను సహజంగా నాటి పండిత కవులను ఒప్పించలేకపోయాడు. ఆటవెలది ఛందస్సుగా వందలాది పద్యాలతో జీవిత సత్యాలను ఆవిష్కరించిన వేమనను పండితలోకం కవిగా గుర్తించలేదు. ప్రజల భాషలో అందరికీ అర్థమయ్యే పదాలను, మాండలికాలను ప్రయోగించి, ఊహ నుంచి కాకుండా జీవితం నుంచి ఉపమానాలు పద్య ప్రక్రియలో జొప్పించిన మానవతా వాదిగా, జగమెరిగిన వేదాంతిగా, సంఘ సంస్కారిగా సాహిత్య, సామాజిక తిరుగుబాటువేత్త అయిన వేమనను పండితలోకం అసలు కవిగానే గుర్తించలేదు. మహాకవి శ్రీశ్రీ వంటి ఆధునికులు పుంఖానుపుంఖాలుగా వ్యాసాలు, ఉపన్యాసాలు, వేమన కవితాగానం, అరుణారుణ జ్ఞానంగా, సాంఘిక దురాచారాలను చీల్చి చెండాడిన, బాణంగా తెలుగు సాహితీ లోకంలో సుప్రతిష్ఠత అందించారు. జనాభిమానం వుండనే వుంది.

అంధకార, క్షీణ యుగంలో జన్మించి మధ్య యుగానికి చెందిన దార్శనిక మహాయోగి అయిన వేమన పద్యాలను 1817 నుండి 1824 వరకు కడప కలెక్టరుకు సహాయకునిగా వున్న సిపి బ్రౌన్, వేమన పద్యాలను వెలుగులోకి తేవడానికి ఎంతో శ్రమించారు. 1829లో తొలి ప్రచురణలో 693 పద్యాలు, ఆ తర్వాత 1839లో 1163 పద్యాలు, అదనంగా 201 మొత్తం 2057 పద్యాలు బ్రౌన్ దొర ద్వారా ప్రచురితమయ్యాయి.

వేమన పద్యాలు, సంస్కృత హితోపదేశాలు, భగవద్గీత, రామాయణ గ్రంథాలలోని నైతిక ధర్మాలు, సూక్తులు జనసామాన్యపు పలుకుబడి, నైతిక భావోత్తేజ వ్యాఖ్యాపరంగా నిర్భయ రీతిలో, నిర్మొహమాటంగా, నిశ్చయ విశ్వాసంతో వ్యంగ్యం, హాస్యం, చమత్కార ధోరణులతో ప్రతిబింబింపచేస్తున్నాయి.

సి.పి.బ్రౌన్, ఎం.డి.క్యాంబెల్, రాంబర్ట్ కాల్డ్‌వెల్ వంటి పాశ్చాత్య మేధావులకు తెలుగు భాషా, సాహిత్యాలు ఎంతో రుణపడి వున్నాయి.

మొదటి పాదంలో విషయం, రెండవ పాదంలో దాని వ్యతిరేక భావం, మూడవ పాదంలో కవిగా సమన్వయం సాధించటం వేమన సాధించిన సాహితీ ఘన విజయంలోని విశిష్టత. ఉదాహరణకి 'ఉప్పు కప్పురంబు నొక్క పోలికనుండు' మొదటి పాదంలో చెప్పి, రెండవ పాదంలో 'చూడ చూడ రుచుల జాడ వేరు' అంటారు. ఆ పరస్పర వ్యతిరేకత సంఘర్షణను సమన్వయం, ఉపదేశం, నీతిగా 'పురుషులందు పుణ్య పురుషులు వేరయా' లాంటి భావన అందిస్తారు.

తెలుగు సాహిత్యంలో జనవేమన 'విశ్వదాభిరామ వినురవేమ' తాత్విక యోగిగా, అజ్ఞానపు అంధకారంలో మూఢాచారాల మధ్య మగ్గుతున్న జాతి ప్రజలకు జ్ఞానజ్యోతి ప్రసరింపచేసింది.

**- జయసూర్య**

# ఈశాన్యం బాగున్నా ఫలితాలు?


వాస్తువార్త

వాస్తు విద్వాన్ సాయిశ్రీ

డా॥ దంతూరి పండరినాథ్

3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్

సెల్: 9885446501/9885449458




**ఈశాన్య లోపం లేకుండా వున్న స్థలాలను కొనటానికి ఎన్నుకోవటమే కాకుండా ఈశాన్యం పెరిగిన స్థలాలనుగానీ, ఈశాన్య బ్లాకులనుగానీ కొనటానికి ఎంతయినా ఖర్చు పెడుతుంటారు చాలా మంది.**

అలాంటి స్థలాలను కొనటమేగాదు, ఈశాన్య దోషరహితంగా ఇల్లు, కాంపౌండు గోడలూ నిర్మించుకున్నప్పుడే లేదు.

ఇటువంటి ఈశాన్య స్థలం కాకపోయినప్పటికీ ఉత్తర ఈశాన్యం పెరిగిన స్థలం ధనాభివృద్ధిని, తూర్పు ఈశాన్యం పెరిగిన స్థలం పేరు ప్రఖ్యాతులను సునాయాసంగా యజమానికందిస్తాయి.

ఈ విధంగా ఈశాన్యం పెరిగిన స్థలాలకయినా, ఈశాన్య బ్లాకులనయినా లేదా ఈశాన్యం తరగని స్థలాలని కొనుక్కొని 'ఈశాన్యం బాగానే వున్నా, మాకు మంచి ఫలితాలు రావడం లేదు' అని చెప్పేవాళ్లు వాయువ్యంలో లేదా తూర్పు ఆగ్నేయంలో లేదా ఈ రెండు చోట్లనయినా అమరితే అది కూడా ఈశాన్య మూత అవుతుంది. ఈశాన్యం వైపు మరో గేటు తప్పనిసరిగా ఉండాలి. అయితే– "ఈశాన్య మూలలో విధిగా గేటు వుండి తీరాలి" అన్న విషయాన్ని

ఈశాన్య సత్ఫలితాలను పూర్తిగా పొందవచ్చు. అలా కాకుండా కట్టడంలో ఈశాన్య లోపం వస్తే రావలసిన మంచి ఫలతాల మాట అటుంచి చెడు ఫలితాలను కోరి తెచ్చుకున్నట్లవుతుంది. ఎలాంటి లోపభూయిష్టమైన కట్టడాల వల్ల ఈశాన్య దోషపూరితమవుతుందో తెలుసుకుంటే దోషరహితంగా ఇల్లు నిర్మించుకోవడం అర్థమవుతుంది.

### 'ఈశాన్య బ్లాకు' అంటే?

నాలుగు రోడ్ల కూడలిలో తూర్పు, ఉత్తరాల వైపు రోడ్డు లేదా వీధులు కలిగివున్న స్థలాన్ని 'ఈశాన్య బ్లాకు' అంటారు. దీనినే ఈశాన్య స్థలం అని కూడా అనవచ్చు. ఇది అన్ని రకాల స్థలాల కంటే విశిష్టమయినది. ఉత్తరం వైపు వున్న వీధి పశ్చిమం నుండి తూర్పుకు పల్లంగానూ, తూర్పున వున్న వీధి దక్షిణం నుండి ఉత్తరానికి పల్లంగా వుంటే ఈ బ్లాకు నిస్సందేహంగా ధనధాన్యాదులు, పేరు ప్రతిష్ఠలు తెచ్చి పెడతాయనటంలో సందేహం





ఎంతోమంది వున్నారు. వాళ్ల గృహాలు పరిశీలించి ఈశాన్యం ఎలా దోషపూరితమైందో తెలిపి, ఆ లోపాలను సవరించిన తరువాత వాళ్ల మంచి ఫలితాలు పొందిన సందర్భాలు అనేకం.

### ఈశాన్య మూత దోషం

స్థలంలో ఈశాన్య మూలలో ఒక షెడ్డుగానీ మరే గృహమయినా ఉత్తర, తూర్పు గోడలను ఆనుకొనిగానీ, ఆనుకొనకుండాగానీ వేసినట్లయితే దానిని ఈశాన్య మూత అనవచ్చు. స్థలానికి ఈశాన్యంలో ఖాళీ స్థలం వదిలి వున్నప్పటికీ ఇంట్లో ఈశాన్య భాగంలో వున్న గదికి తలుపులు లేకపోతే అది కూడా ఈశాన్య మూత పడిన ఇల్లు అవుతుంది. ఈశాన్య స్థలానికిగానీ, మరే స్థలానికిగానీ, ప్రధాన ద్వారానికి ఎదురుగా పెట్టిన గేటు ఉత్తర కొందరు కచ్చితంగా పాటిస్తారు. ఇలాంటి చిన్న చిన్న జాగ్రత్తలు పెద్ద పెద్ద నష్టాల నుండి కాపాడతాయి.

ఈశాన్య మూల మూతపడటం ద్వారా ఆ ఇంటికి యజమానికి కారు వున్నా, కారు పెట్రోలుకి డబ్బులుండవు. అటువంటి వింత పరిణామాలు ఏర్పడతాయి.

ఉదా: ఓ ఇంట్లో నైరుతి మూలలో (బయటి వైపు) పెద్ద గొయ్యి వుంది. అలా వుండటం వాస్తు పరంగా మంచిది. కాదని ఒకరు ఇచ్చిన సలహా ప్రకారం ఇంటికి ఈశాన్య మూలలో పెద్ద గొయ్యి తవ్వించి అందులో గడ్డపారలు, పెద్ద బండరాళ్లు వేశారు, ఆ గొయ్యికి పూజలు చేశారు. ఈవన్నీ ఈశాన్యాన్ని దోషపూరితం చేయటమేగానీ వృద్ధిరించటం కాదు.

# మహాత్ముని స్మృతిలో..



**గాంధీ** జయంతి అంటే ఆయన విగ్రహానికి దండం వేసి ఉపన్యాసాలు చెప్పడం కాదు. జనవరి 30న వర్ధంతి అంటే సైరన్ మోత విని బడిలో రెండు నిమిషాలు నిశ్శబ్దం పాటించడం, ఎక్కడి వాహనాలు అక్కడే ఆగడం కాదు. గాంధీ జీవితంలో ధక్కామొక్కీలు ఆయన గురించి రాసిన వ్యాసాలు పుస్తకాలు చదవాలి. పిల్లలకి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు పెట్టాలి.

గాంధీజీ జీవితంలో కొన్ని ముఖ్య ఘట్టాలు పాఠాలుగా ఉన్నాయి. సత్యహరిశ్చంద్ర నాటకం చూసి జీవితంలో అబద్ధం ఆడనని నిశ్చయించుకొన్నాడు. శ్రవణుడు అంధులైన తల్లిదండ్రులను కావడిలో మోసే నాటకం చూసి చలించాడు.

ఇక బాల్యంలో డిక్టేషన్‌లో ఒక పదం తప్పు రాస్తే మాష్టారు పక్క విద్యార్థి దగ్గర చూసి కాపీ కొట్టి రాయమని సైగ చేసినా వినలేదు. ఇక చెగడు సావాసంతో దొంగతనం చేసి మాంసం తినటం, సిగరెట్ తాగటం ఆ రాత్రి కడుపులో మేక మేమే అని అరుస్తున్న భ్రాంతితో జాగారం చేశాడు. మంచాన పడిన తండ్రి కాళ్లు వత్తుతూ కన్నీరు మున్నీరుగా ఏడ్చాడు. తండ్రికి తాను చేసిన తప్పులు కాగితంపై రాసి తలదగ్గర పెట్టాడు.



తండ్రి అది చదివి బొటబొటా కన్నీరు కారుస్తూ ఉండిపోవటం బాలగాంధీని కలచివేసింది.

విదేశీ ప్రయాణానికై బయలుదేరుతూ మద్యం, మాంసం, మగువను తాకనని తల్లికి ప్రమాణం చేసి ఓడ ఎక్కాడు. జీవితాంతం అవి పాటించాడు. బాపూ అహింస అంటే ఇలా నిర్వచనం చెప్పాడు.. "మనసులో కానీ చేతలో కానీ ఏ జీవికీ హాని చేయకుండా ఉండటం, శాంతి అహింస పేరుతో సోంబేరులాగా, పిరికివారుగా మారకూడదు" అని.

అవి సత్యాగ్రహం రోజులు. బ్రిటిష్ పోలీసులు ఓ గ్రామాన్ని ధ్వంసం చేసి ఆడవారి శీలాన్ని హరించారు. గాంధీజీ అక్కడికి వెళ్తే వారు "బాపూ! మీరు శాంతం, సహనం, ఓర్పుగా ఉండాలి" అన్నారు కదా! అందుకే మేం ఎదిరించలేద"ని అన్నారు.

దానికి ఆయన "మీరు నా మాటలు తప్పుగా అర్థం చేసుకోవడం నాకు సిగ్గుగా ఉంది. మీ ఆడవారి మానమర్యాదలు కాపాడటం మీ ధర్మం, కర్తవ్యం కాదా? పిరికితనం పనికిరాదు. భగవద్గీతలో కృష్ణుడు ఏం చెప్పాడు? అన్యాయాన్ని ఎదుర్కోవడం నేరం కాదు. హింస విజృంభించి సర్వనాశనం చేస్తుంది. పిడుక్కీ, బియ్యానికీ ఒకే మంత్రం పనికిరాదు" అన్నాడు.


ఇక సంసారంలో ఉంటూ బ్రహ్మచర్యం పాటించాడు. కస్తూరీబాయికి చదువు చెప్పడం, ఆమె చేత అక్షరాలు దిద్దించి గుజరాతీయ భాషలో పట్టు సాధించేలా చేశారు ఆయన. ఆంగ్లం అర్థం చేసుకోవాలి అని, ఆమెకి తర్ఫీదు ఇచ్చారు. రోజూ చపాతీలు, ఉడకబెట్టిన కూరలు, వేపాకు ముద్ద, నిమ్మరసం, మేకపాలు ఆయన ఆహారం.

ఒకసారి ఆయనకి చిన్న ఆపరేషన్ చేయాల్సి వచ్చింది. మత్తు మందు అవసరం లేదని తోటివారితో చెప్పారు. అలా ఆపరేషన్ సక్సెస్ కావటానికి కారణం విల్ పవర్. తన కన్నా పిన్న వయస్కురాలైన యోగానంద నుండి క్రియాదీక్ష తీసుకున్నారు. ఆయన మాటే మంత్రం. ఆయన కళ్లలోకి సూటిగా చూస్తూ మాట్లాడే శక్తి లేదు అని బ్రిటిష్ గవర్నర్ అన్నాడు. అంటే ఆ బక్కమనిషిలో ఎంత సమ్మోహన శక్తి ఉందో కదా!

...

తెలుగు సాహిత్యంలో గాంధీజీ అన్ని విధాలా నిండిపోయి పరిపుష్టి చేకూర్చారు. ఆయన్ని భగవంతుని అవతారంగా కీర్తించారు. ఆయనే కృష్ణుడు, రాట్నమే

వేణువు, భారతదేశం బృందావనం, ప్రజలు గోపికలు. తుమ్మల సీతారామమూర్తి మరింగంటి శేషాచార్యులు, అంబటి సుబ్బరాయగుప్త కావ్యాలు రాశారు. తుమ్మల "పలికెడిది గాంధీ కథయట పలికించెడివారు తెలుగు ప్రజలట. పలికెదనిక బాపు చరిత్రన్" అన్నారు. మరింగంటివారు నిర్యాణపర్వం రాశారు. నండూరి చంద్రమతీదేవి "శాంతి విజయం"లో ఆయన సిద్ధాంతాలు రాశారు.



ఇక బుద్ధవరపు సత్యనారాయణ శ్రీ గాంధీ శతగీతి, దోమా వెంకటేశ్వరగుప్త మహాత్మాగాంధీ శతకం, ఇంకా మంగిపూడి వెంకటశర్మ కందపద్యాలు, వైనం శంకరశర్మ, జీడిగుంట శ్రీరామమూర్తి భాగవతుల నృసింహ శర్మ మొదలైనవారు గాంధీ శతకాలు రాశారు. వడ్లమూడి గోపాల కృష్ణయ్య "నెత్తినొక చిన్న పిలకయు సత్తువ లేనట్టి తనువు.. బోసినగవును హత్తిన రూపంబునున్న హారుడవో గాంధీ" అన్నారు. సర్వశ్రీ రాయప్రోలు గురజాడ బలిజేపల్లి దుగ్గిరాల, దువ్వూరి జాషువాల రచనలు కోకొల్లలు. జాషువా "గోచిపాతను కట్టుకొని జాతిమానంబు నిలిపినట్టి ఖద్దరు నేతగాడు" అన్నారు.

కరుణశ్రీ మాటల్లో "అతడొక పవిత్ర ధర్మదేవాలయంబు.. అతడొక విచిత్ర విశ్వవిద్యాలయంబు.. అతడొక పెద్ద హిమాలయంబు" అన్నారు.

దాశరథి తన క్షమామూర్తిలో " క్రీస్తు వలె ఆపదంబుజమస్తము రక్తాన మునగ" అంటారు.

చెళ్ళపిళ్ళ శ్రీపాద విశ్వనాథ నాయని కుందుర్తి కాళోజీ ఇంద్రగంటి మొదలైనవారి రచనలు గాంధీ తత్వాన్ని ఎత్తి చూపుతాయి.

చెళ్ళపిళ్ళ దుర్గేశ్వర శాస్త్రి అశ్రుతర్పణం ఇలా ఇచ్చారు "ఆసియా ఖండపుజ్యోతి యారినది గాంధీ మహాత్ముని ప్రాణదీపమై".

వానమామలై వరదాచార్యులు తన కర్మచంద్రుడు గ్రంథంలో "ఒక్క నాలుక గలనీదు నిక్కపు కథ కలమదెట్టువ్రాయు రెండు నాల్కల మొగాన?" అని వాపోయారు.

ఇంకా గేయాలు, పాటలు కోకొల్లలు. దామరాజు పుండరీకాక్షుడి "గాంధీ నామాం మరువాం మరువాం", బసవరాజు అప్పారావు "కొల్లాయి గట్టితేనేమీ మా గాంధి కోమటై పుట్టితేనేమి వెన్నుపూస మనసు కన్నతల్లి ప్రేమ.. నాల్గు పరకల పిలక నాట్యమాడే పిలక నాలుగూ వేదాల నాణ్యమెరిగిన పిలక" ఆ రోజుల్లో జనాల్ని ఉర్రూతలూగించింది.

దేవులపల్లివారు "కమ్మగా బతికితే గాంధీ యుగం.. మనిషి కడుపునిండా తింటే గాంధీ జగం రేడియోలో నేటికీ ఉర్రూతలూగిస్తుంది".

...

నూలు వడకటం వల్ల బాపూ కళ్లు విపరీతంగా అలిసి మంటగా అనిపించేది. కళ్లకి విశ్రాంతి ఇవ్వాలని డాక్టర్లు ఇచ్చిన సలహాలు తోసిపుచ్చారు. ఆడమ్ బతిమాలేవాడు. దానికి ఆయన "సూర్యచంద్రులు తమ టైం ప్రాకరం ఆకాశంలో విధులు నిర్వహిస్తున్నారు. వారు లేకుంటే నీవు, నేను కూడా ఉండం. నా విధి ధర్మానికి కట్టుబడి ఉంటాను" అన్నాడు.

ఆడమ్ నిస్సహాయంగా, దీనంగా చూసేవాడు. బాపూ తిండి కూడా తగ్గించారు. కేవలం రెండు రొట్టెలు తినేవారు. "బాపూజీ! మీరు రొట్టెలు తగ్గిస్తే ఎలా? ఓపిక కావాలి కదా!" అని బతిమాలేవాడు ఆడమ్. అతన్ని స్వదేశానికి పంపమని సూపరింటెండ్‌కి చెప్పి గాంధీజీ ఏర్పాటు చేశారు.

...

బాపూజీని సబర్మతీ జైలు నుంచి ఎరవాడ జైలుకి మార్చిన రోజులవి. ఇక్కడి జైలు సూపరింటెండ్ మహా నిక్కచ్చి మనిషి. కఠోర స్వభావి. కానీ ఆయనపై ప్రత్యేక అభిమానంతో యూరోపియన్లు ఉండే గదికి మార్చాడు. బాపూజీకి అది నచ్చలేదు. "జైలర్‌కి సూపరింటెండెట్‌కి నా వల్ల అపకారం జరుగుతుంది. ప్రభుత్వం వారిని శిక్షిస్తుంది" అని బాధపడేవారు.

"గాంధీజీ! నా గురించి చింతించవద్దు. కావాలంటే నేను రిజైన్ చేస్తాను" అని ధీమాగా పలికేవాడు అధికారి.

కానీ బాపూజీ బలవంతపెట్టడంతో జైలర్ ఆయనను పాత సెల్‌లోకే పంపక తప్పలేదు. మూడు రోజుల తర్వాత సూపరింటెండెంట్ వచ్చి "బాపూ! మీరన్నదే నిజం. నా ఉద్యోగానికి తిలోదకాలు ఇవ్వాల్సి వచ్చేది" అని ఆయన దూరదృష్టిని కొనియాడాడు. ఆనాటి ప్రభుత్వోద్యోగులలో రాజకీయ నేతలలో చిత్తశుద్ధి ఉండేది.

...

భారత స్వాతంత్ర్యోద్యమంలో అందరికీ తండ్రి బాపూజీగా పిలువబడే ఆయన గురించి రాయాలంటే ఓ పెద్ద గ్రంథం అవుతుంది. తెలుగు సాహిత్యంలో కూడా ఆయన అన్ని రకాల ప్రక్రియల్లో వర్ణింపబడిన మహోన్నతుడు.




ముఖ్యంగా ఆయనపై వచ్చిన మూడు సినిమాలు ప్రపంచమంతా విడుదలైన సంచలనం సృష్టించాయి. 'గాంధీ' అనే సినిమాని రిచెర్డ్ అటెన్బరో డైరెక్ట్ చేశాడు. బెన్ కింగ్స్‌లె బాపూజీ పాత్రలో జీవించాడు. 9 అకాడమీ అవార్డులు పొందింది. ప్రపంచమంతా విడుదలైంది. గాంధీ అంతిమ యాత్ర కోసం 3 లక్షల మంది ఎక్స్ట్రా నటులు పాల్గొన్నారు. గిన్నిస్ బుక్‌లోకి ఎక్కింది. ఇక 21 ఏళ్ల దక్షిణ ఆఫ్రికాలో గాంధీ జీవితాన్ని కళ్లకు కట్టినట్లు చూపించిన చిత్రం "ది మేకింగ్ ఆఫ్ ది మహాత్మా". మోహన్‌దాస్ నుంచి మహాత్మాగా మారిన ఘట్టాలు చూస్తాం. ఆఫ్రికన్ ఫాతిమా మీర్ రాసిన పుస్తకం ఆధారంగా ఈ చిత్రం నిర్మించబడింది. శ్యాంబెనెగల్ దీని దర్శకుడు. రజిత్‌కపూర్ గాంధీగా నటించాడు. ఈ చిత్రం రెండు నేషనల్ అవార్డులు పొందింది. ఇక "గాంధీ మై ఫాదర్" సినిమాలో గాంధీజీ పెద్ద కొడుకు హరిలాల్‌కి బాపూకి మధ్య జరిగిన ఘర్షణ చిత్రించారు. 3 జాతీయ అవార్డులు పొందిన ఈ చిత్రంలో గాంధీగా దర్శన్ జరివాలా కొడుకు హరిలాల్‌గా అక్షయఖన్నా నటించారు.

**- అచ్యుతుని రాజశ్రీ**



# మహాత్మా! చూస్తున్నావా?

ఓ మహాత్మా!
చెడు అనకు, వినకు, చూడకు
అన్న పలుకులు నీవైతే
నేటి సమాజానికవే ప్రీతిపాత్రం.
అహింసా యోధుడవు నీవు,
హింసావీరులు నేటి
నాయకగణం.
సర్వమత ఐక్యత నీ పథం
అనైక్యతే నేటి జనుల మార్గం.
మద్యం వద్దని నీవు,
అదే ముద్దని నేటి ప్రభుత్వం.
మహిళా సాధికారత నీ కల,
మరి నేడో...
కలకంఠి కంట కన్నీరు
చూడందే
నిద్రపోని పాషండులెందరో!
గ్రామ స్వరాజ్యం నీ ఊహాసుందరి,
దాని అభావానికై
నేటి పాలకుల శక్తివంచన లేని కృషి.
నీవు చూపిన నాటి విరి బాట
నేటి రాజకీయాలకు ముళ్లబాట.
సమానతే నీ ధ్యేయం,
అసమానతే/ నేటి తరం లక్ష్యం.
నిరాడంబరతే నీ భావనైతే
ఆడంబరయుత పోకడలు
నేటి యువత చిరునామా!
నాటి నీ పాదయాత్ర ఏకతా రాగమైతే
నేటి పాదయాత్రలు/హింసాయుత మార్గాలు,
శాంతి భద్రతల భగ్నానికి
దగ్గర దారులు.



- వేమూరి శ్రీనివాస్

## జీవితం

నేను అప్పుడప్పుడూ
ఆలోచన చేస్తుంటాను
అన్నీ అందుబాటులో ఉన్నాయి
ఏదీ నాది కాదు
ఇదేనా జీవితం?
చెప్పుకోవడానికి ప్రపంచం అంతా నాదే
నా అనేవారు ఎవరూ లేరు
ఒక్కరు లేరు
ఇదేనా జీవితం?
బంధాలు బాంధవ్యాలు
కేవలం పేరుకే
ఆత్మీయత ఎక్కడా లేదు
వెతికినా కనబడలేదు
ఇదేనా జీవితం?
ఎటు చూసినా ఏదో బాధ
ఎటు చూసినా ఏదో వ్యధ
దీనికి అంతే లేదా
ఇదేనా జీవితం?
ఎటు చూసినా నటనలు
అవసరమైనంత వరకే అనుబంధాలు
పెదవులపై నిందలు
మనిషికి మనసే లేదా
ఇదేనా జీవితం

- అరుణ డేనియల్

## ఈ వారం కవిత్వం

# ఇష్టం

చదవడం ఇష్టమా
కనిపించే దృశ్యం ఇష్టమా అంటే-
ఏం చెప్పగలం?
కళ్లు ఇష్టమా
మాట్లాడే నోరు ఇష్టమా
అన్నట్లుంటుంది!
అమృతం ఇష్టమా



పంచభక్ష్య పరమాన్నం ఇష్టమా
అంటే-
ఆకలి తీర్చే
గుప్పెడన్నం చాలంటాను.
దేశం ఇష్టమా
పరదేశం ఇష్టమా అంటే
మానవ వినాశనం కోరని..
యుద్ధతంత్రాలు నేర్వని..
యుద్ధమంటే అసలు గిట్టని
దేశమే ఇష్టమంటాను
ప్రపంచ మానవ శ్రేయస్సే
పరమిష్టమిష్టమంటాను!

- చలపాక ప్రకాష్





# వారఫలం

పాలకుర్తి సంతోష శర్మ, స్మార్త పండితులు
సుబ్బరాజు టవర్స్, 11-10-30/308
విజయపురి కాలనీ, కొత్తపేట
హైదరాబాద్. ఫోన్: 9494608133

## మేషం



విదేశీ ప్రయాణ ప్రయత్నాలు ఫలిస్తాయి. క్రయ-విక్రయాలు సామాన్యం. గృహ రుణాలు తీర్చి ఊరట పొందుతారు. ఆలోచనల్లో స్థిరత్వం లోపిస్తుంది. ఆరోగ్య, ఆహార సలహాలు-సూచనలు పాటించడం అత్యవసరం. ఉద్యోగులకు పనివత్తిడి పెరుగుతుంది. కుటుంబంలో స్వల్ప మనస్పర్థలకు అవకాశం. ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

## వృషభం



చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు. ఆరోగ్య సమస్యలుంటాయి. సాహిత్య సభలు, సమావేశాల్లో పాల్గొంటారు. భూ తగాదాలు మరింత జటిలమవుతాయి. ఆదాయానికి మించిన ఖర్చులుంటాయి, సంయమనంతో వ్యవహరించండి. ఉత్సాహంగా గడుస్తుంది. సంతానాభివృద్ధి సంతృప్తినిస్తుంది. విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు లభిస్తాయి.

## మిథునం



ఉద్యోగ ప్రయత్నం ఫలిస్తుంది. జీవిత భాగస్వామితో విభేదాలు వచ్చే అవకాశం. ధర్మ రక్షణకై పాటుపడతారు. విందు-వినోదాల్లో పాల్గొంటారు. వృత్తి విద్యా కోర్సుల పట్ల ఆసక్తి ఏర్పడుతుంది. దుర్వ్యసనాలకు దూరంగా వుండాలని దృఢ నిశ్చయం చేసుకుంటారు. కుటుంబంలో ఐకమత్యం ఏర్పడుతుంది. రియల్ ఎస్టేట్ రంగంలోని వారికి సామాన్యం.

## కర్కాటకం



అనుకోని సంఘటనలు జరిగినా ధైర్యంతో ఎదుర్కొంటారు. తీర్థ యాత్రలు చేస్తారు. వృత్తి రంగాల్లో వున్నవారికి పోటీ అధికం. కీర్తి ప్రతిష్ఠలు లభిస్తాయి. సామాన్య ధన లాభాలుంటాయి. అనుకోని అతిథుల రాక. వివాదాలకు దూరంగా వుండటం మంచిది. ఎదురు చూస్తున్న శుభ వర్తమానం అందుకుంటారు. స్త్రీలకు శుభ యోగం.

## సింహం



చిరకాల కోరిక వారాంతంలో తీరుతుంది. దేశాంతర ప్రయాణ సూచనలున్నాయి. వృత్తి విద్యా కోర్సుల్లో చేరతారు. అకారణంగా మానసిక సంఘర్షణకు లోనవుతారు. ఉద్యోగులకు పై అధికారుల ప్రశంసలు లభిస్తాయి. తాహతుకు మించిన రుణాలు చేస్తారు. వృధా కాలక్షేపం చేస్తారు. దూర ప్రాంతాల్లో వున్న ఆత్మీయుల నుండి శుభ వార్తలు వింటారు.

## కన్య



విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు లభిస్తాయి. ఆకస్మిక ప్రయాణం చేస్తారు. వృత్తి వ్యాపారస్తులకు పోటీ ఏర్పడుతుంది. కుటుంబంలో కలతలకు ఆస్కారం. స్త్రీలకు ఆరోగ్య సమస్యలుంటాయి. దీర్ఘకాలిక సమస్యలకు వారాంతంలో పరిష్కారం లభిస్తుంది. ప్రారంభించిన పనులు ఆకస్మికంగా వాయిదా పడతాయి. పెట్టుబడులు లాభిస్తాయి. గృహ ప్రాప్తి.

## తుల



అనూహ్యంగా మొండి బకాయిలు వసూలవుతాయి. తీర్థ యాత్రలు చేస్తారు. కోర్టు వ్యవహారాలు సానుకూలం. కుటుంబ సభ్యులతో కలిసి విందు-వినోదాల్లో పాల్గొంటారు. శత్రువులు మిత్రులవుతారు. సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆదాయానికి మించిన ఖర్చులు అసహనం కలిగిస్తాయి. ప్రతికూలతలు ఎదురైనా ముఖ్యమైన పనులు పూర్తి చేస్తారు. సాహిత్య సభలు, సమావేశాలకు హాజరవుతారు.

## వృశ్చికం



వివాదాలు తీవ్రమవుతాయి. ప్రభుత్వ సంబంధమైన పనులు పూర్తవుతాయి. శత్రువులు మిత్రులవుతారు. సామాన్య ధన లాభాలుంటాయి. చిరు వ్యాపారులకు పోటీ అధికం. హోల్ సేల్ వ్యాపారులకు బ్యాంకు రుణాలు మంజూరు. ఉద్యోగ ప్రయత్నం ముమ్మరం చేస్తారు. ఆలోచనల్లో స్థిరత్వం ఏర్పడుతుంది. వ్యవసాయ భూమి కొనుగోలు చేస్తారు. క్రీడాకారులకు, కళాకారులకు ఆర్థిక ప్రోత్సాహం లభిస్తుంది.

## ధనుస్సు



విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు లభిస్తాయి. స్త్రీలకు శుభ యోగం. చోర భయం పొంచి వుంది కనుక విలువైన పత్రాలు/వస్తువుల పట్ల జాగ్రత్తలు పాటించండి. శుభ కార్యాల్లో పాల్గొంటారు. సన్నిహితుల సహకారంతో ముఖ్యమైన పనులు పూర్తి చేస్తారు. వాక్చాతుర్యంతో అందరినీ ఆకట్టుకుంటారు. ఆకస్మిక సంఘటనలు జరిగినా ధైర్యంతో ఎదుర్కొంటారు. పెట్టుబడులను వాయిదా వేయడం మంచిది.

## మకరం



దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారమవుతాయి. సంతానాభివృద్ధి సంతృప్తినిస్తుంది. వృత్తి విద్యా కోర్సుల్లో చేరతారు. ఆరోగ్య సలహాలు-సూచనలు పాటించడం తప్పనిసరి. ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. గృహ రుణాలు తీర్చి ఊరట పొందుతారు. ఉద్యోగులకు స్థాన చలన సూచనలున్నాయి. సాహస నిర్ణయాలు తీసుకుంటారు. వృద్ధుల ఆరోగ్యం ఆందోళన కలిగిస్తుంది. శ్రమకు తగిన ప్రతిఫలం లభిస్తుంది.

## కుంభం



ప్రత్యర్థుల వ్యూహాలను చాకచక్యంతో ఎదుర్కొంటారు. శుభ కార్యాల్లో పాల్గొంటారు. తీర్థ యాత్రలు చేస్తారు. కుటుంబంలో మనస్పర్థలు. దేశాంతర ప్రయాణం చేస్తారు. అన్ని వ్యవహారాల్లో ఆచి తూచి వ్యవహరించడం చెప్పదగిన సూచన. ఆలోచనల్లో స్థిరత్వం ఏర్పడుతుంది. క్రయ- విక్రయాల్లో ఆశించిన ఫలితాలు ఉండకపోవచ్చు. వాహన యోగం.

## మీనం



వ్యాపారస్తులకు పోటీ ఉన్నా ఎవరి లాభాలు వారికి ఉంటాయి. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి. వృధా ఖర్చులను నియంత్రించడంలో విఫలం. భాగస్వామ్య వ్యాపారులకు ఆశించిన లాభాలుంటాయి. మొండి బకాయిలు వసూలవుతాయి. ఏది జరిగినా మన మంచికే అన్న ధోరణి అలవడుతుంది. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. వ్యవసాయ భూమి కొనుగోలు చేయాలన్న కోరిక తీరుతుంది.

# మనందరికీ రెండు వయసులుంటాయి!

కొందరిని చూస్తే వయస్సు అరవై ఏళ్లేమో అనిపిస్తుంది. కానీ ఆయన నిజమైన వయస్సు ఎంతని అడిగితే ఓ నలభయ్యో నలభై అయిదో ఉంటుంది. కొందరు చూడటానికి నలభై అయిదేళ్ల వాళ్లలా కనిపిస్తారు. కానీ వారి అసలు వయస్సు అరవై అయిదేళ్లే పైబడే ఉంటుంది.

మనిషికి రెండు రకాల వయస్సులు ఉంటాయంటారు ఓషో.

అంటే, శరీరానికి ఓ వయస్సు, మనస్సుకి ఓ వయస్సు.

మొదటి ప్రపంచ యుద్ధం జరిగింది కదా. అది ముగిసిన తర్వాత మొదటిసారిగా మనిషి మెదడుకి సంబంధించి మానసిక వైద్యులు ఓ పరిశోధన జరిపారు.

అప్పటివరకు మనిషికి రెండు రకాల వయస్సులు ఉంటాయని ఎవరూ ఆలోచించనేలేదు.

మొదటి ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత మనిషి సరాసరి వయస్సుని లెక్కించినప్పుడు వారికి ఆశ్చర్యం వేసింది.

ఎందుకంటే అది చాలా వెనుకబడి ఉండటమే. వృద్ధి చెందని స్థితిలో ఉండటమే అందుకు కారణం.

వారి పరిశోధన ప్రకారం మనసు సరాసరి వయస్సు పధ్నాలుగేళ్లు.

శారీరకంగా ఒకరి వయస్సు 70 ఏళ్ల వరకూ ఉంది. కానీ మనసు వయస్సు పధ్నాలుగేళ్లే.

ఇందుకు భిన్నంగా ఉందనుకుందాం. అంటే ఒకరి వయస్సు నిజంగానే పధ్నాలుగు అనుకోండి.. శారీరకంగా అతని వయస్సు పధ్నాలుగేళ్లు.

ఆయన మనసు వయస్సు డెబ్బయేళ్లనుకోండి.. ఆయన శీఘ్రమే జ్ఞానోదయం పొందుతారని అర్థం.

మనందరికీ శారీరక వయస్సు, మనస్సు వయస్సు ఒక్కటిగా ఉంటే చాలు, అదే పెద్ద విషయం.

రాల్ఫ్ వాల్డో ఎమర్సన్(1803-1882) అనే అమెరికన్ వక్త, వ్యాసకర్త, తత్వవేత్త, కవి ఉండేవారు. ఆయనను అందరూ వాల్డో అని పిలిచేవారు.



ఆయన అమెరికా అంతటా పదిహేను వందల ప్రసంగాలు చేశారు. అనేక వ్యాసాలు రాశారు.

ఆయన వద్దకు వెళ్లిన ఓ వ్యక్తి అడిగాడట.. "మీ వయస్సు ఎంత?" దానికి ఆయన వెంటనే జవాబు చెప్పారట "360 ఏళ్లని".

ఆ మాటకు ప్రశ్న అడిగినతను కంగుతిన్నాడు.

"ఏమంటున్నారు? మూడు వందల అరవై ఏళ్లా? నా చెవులు సరిగ్గా పని చేయడం లేదేమో?" అనుకున్నాడట.

ఎందుకంటే ఎమర్సన్ అనే వ్యక్తి ఎప్పుడూ నిజం మాట్లాడతాడని పేరుంది. ఆయన తెలివితేటలు అపారమని కూడా అందరికీ తెలుసు. అటువంటి మనిషి ఇలా అబద్ధం చెప్తారా? అని అతని ఆలోచన.

ఎమర్సన్‌ని ప్రశ్నించిన మనిషి ఏవేవో ఆలోచిస్తూ మళ్లీ ఆయనను అడిగారు.

"అయ్యా.. మీరు చెప్పింది నా చెవులు సరిగ్గా వినలేదు. కనుక మళ్లీ అడుగుతున్నాను... ఏమీ అనుకోకండి.. మీ వయసు ఎంతండీ?" అని అడిగాడు ఆ మనిషి.

ఎమర్సన్ మళ్లీ అదే జవాబు చెప్పారు "తన వయస్సు 360 ఏళ్లని".

ప్రశ్నించిన వ్యక్తికి బుర్ర పని చేయడం లేదు. ఏమిటీయన అలా అంటున్నారని ఆలోచనలో పడ్డాడు. కాస్సేపు తర్వాత ఆ వ్యక్తి మెల్లగా మొదలుపెట్టాడు మాటలు.

"అయ్యా, మీరు చెప్పిన జవాబుని నేను స్వీకరించడం లేదు. ఎంతలా చూసినా ఇప్పుడు మీ వయస్సు అరవైకి పైబడి ఉంటుంది తప్ప మీరు చెప్తున్నట్టు మూడు వందల అరవై ఏళ్లు కావడానికి అవకాశమే లేదన్నాడు".

అప్పుడు ఎమర్సన్ "మీరు చెప్తున్నది నిజమే.. అది నా శరీర వయస్సు" అన్నారు.

"అంటే, ఇప్పటికే మీరు చెప్పిన ఆ సంఖ్య ఏమిటీ?" అని అడిగాడు ప్రశ్నించిన మనిషి.

"అది నా మనస్సు వయస్సు" అని ఎమర్సన్ చెప్పారు. మనకు సంబంధించినంత వరకూ జ్ఞానం బూజు పట్టింది. అలాగే ప్రేమ బూజు పట్టింది. ఈ రెండింటి దుమ్మూ దులపాలి. అంటే శుభ్రం చేయాలి. అప్పుడే మనం సరైన వయస్సుతో జీవించొచ్చు.

...

అనగనగా ఓ మనిషి ఉన్నాడు. అతనికి శరీర వయస్సు అధికం. మనస్సు వయస్సు చాలా తక్కువ. ఇంకా చెప్పాలంటే చిన్నా పిల్లాడిలా అనుకోండి.

అతను ఓ ఆస్పత్రిలో పడుకున్నాడు. నర్సు అందరికీ మందులు ఇచ్చి వెళ్లింది. కాస్సేపు తర్వాత ఆమె తిరిగి ఆ వార్డుకి వచ్చింది.

అప్పుడు ఆ మనిషి ఆమెను పిలిచి చెప్పాడు..

"ఇదిగో చూడు సిస్టర్.. మీరు అందరికీ చిన్న చిన్న మాత్రలు ఇచ్చి నాకు మాత్రం పొడవాటి మాత్రం ఇచ్చారు. మింగడానికి చాలా కష్టమైంది. ఇక మీదట నాకు కూడా చిన్న చిన్న మాత్రలే ఇవ్వండి" అన్నాడు.

అప్పుడు నర్సు కంగుతిని తల మీద కొట్టుకుంది.

"నేను కష్టపడి మాత్ర మింగినందుకు మీరెందుకు తల మీద కొట్టుకున్నారు?" అని అడిగాడతను.

దానికామె జవాబిస్తూ "నేను మీకు ఇచ్చింది మాత్ర కాదండీ.. అది థర్మామీటర్" అంది.

**- యామిజాల జగదీశ్**

# అర్హత

గంగాధర్ వడ్లమన్నాటి

లలిత తన మొబైల్ చూసుకుంటూనే 'యాహూ' అని ఎగిరి గంతేస్తూ అటుగా వెళ్తున్న ఆఫీస్ బాయ్ అప్పారావ్ కాలుని కసుక్కున తొక్కేసింది.

దాంతో అతను "అమ్మోయ్, చచ్చాన్రా రావుడో" అంటూ చెవులు మూసుకుని మైకు మింగినట్టు అరిచాడు.

అది చూసిన లలిత, "అయ్యో.. సారీ అప్పారావ్! గంతేస్తూ బ్యాలన్స్ తప్పి నీ కాలుని పిప్పి చేశాను. ఏడవకు" అంటూ కళ్లు తుడిచింది. తర్వాత పర్స్‌లోంచి రెండొందలు తీసి "మందులు కొనుక్కో" అంటూ జేబులో పెట్టింది.

ఆ డబ్బులు చూసి "పోనీలెండి, మీ హీలుతో నా కాలుని తోలొచ్చేలా తొక్కినా హీల్ చేయించుకోడానికి డబ్బులిచ్చారు.. సంతోషం" అని అక్కడి నుండి వెళ్లిపోయాడు అప్పారావ్.

లలిత ఇంత సంతోషంగా గంతేయడానికిగల కారణం.. తాను కొద్ది నెలలుగా ఎదురు చూస్తున్న అవార్డ్ ఎంపిక కోసం తీసిన ఫైనల్ లిస్ట్ నలుగురిలో ఆమె పేరు ఉంది. పైగా ఆమెదే మొదటి పేరు. దాంతో ఆమె ఆనందానికి హద్దులు లేవు. జాయిన్ అయిన ఒక సంవత్సరంలోనే ఇది సాధ్యమైంది. అందుకే ఆమెకి ఇంత సంతోషం.

అయితే ఇది అంత తేలిగ్గా సాధ్యపడలేదు. ఆ గొప్ప పేరు అందుకోవడం కోసం ఆమె ఎన్నో ఆలోచనలు చేసింది. తన సీ.ఈ.ఓ.ని ప్రసన్నం చేసుకోవడానికీ, అతన్ని ఇంప్రెస్ చేయడానికీ చాలా మందిపై చాడీలని, చేగోడీలు తిన్నంత తేలిగ్గా చెప్పేది. మిగతా వారు చేసిన చిన్న చిన్న చీమ తలకాయంత తప్పులని సైతం గున్నేనుగంత చేసి చూపేది. వాటిని ఆమెకు అనుకూలంగా ఆయన చెవిలో వేసి, పెద్ద ఇంప్రెషన్ కొట్టేసేది. ఇలా తనకి పోటీ వస్తారు అనుకున్న వారందరి మీద ఏదో ఒక కంప్లయింట్ ఉండేలా చేసింది. అలానే అతని భార్యామణి ఆ సంవత్సరంలో ఒకటి రెండు సార్లు కంపెనీ యానివెర్సరీకి, బెస్ట్ ఎంప్లాయ్ అవార్డ్స్ ఇవ్వడానికిగాను వచ్చింది. ఆవిడ వచ్చినప్పటి నుండీ ఆవిడని అతుక్కుని మరీ ఆవిడ కళ్లల్లో పడింది. తర్వాత ఇంటి దగ్గర వండి తెచ్చిన పులిహోర అంటూ ఆమెకి తినిపించింది. ఇన్ని చేసాక ఆ బెస్ట్ ఎంప్లాయ్ అవార్డూ, లక్ష రూపాయల నగదు ఆమెకి కాక ఇంకెవరికి వస్తుంది. పైగా ఆమె పేరు లిస్టులో మొదటిది కూడా. ఇక అనుమానం లేదనుకుంది.

కొందరైతే ఇప్పుడే కరచాలనం చేస్తూ మరీ కంగ్రాట్స్ చెప్పేస్తున్నారు. ఆ సంతోషంతోనే ఈరోజు కాస్త గర్వంగా ఫీలయిపోతూ, కాలు మీద కాలు వేసుకుని మరీ కంప్యూటర్‌లో పని చేసుకుంటోంది.ఇంతలో ఒక అమ్మాయి వచ్చి "ఎక్స్క్యూజ్ మీ మేడం.. ఈ చిన్న డౌట్ క్లియర్ చేసి చెప్తారని వచ్చాను" అని కంప్యూటర్‌లో ఓ ఫైల్ ఓపెన్ చేసి, "ఇక్కడ ఈ లైన్ నాకు సరిగా అర్థం కావడం లేదు" అని ఆమె ఏదేదో అడిగినట్టు అనిపించింది. పూర్తిగా అర్థం కాలేదు లలితకి.

"అయినా ఎప్పుడూ లేనిది ఇప్పుడు నన్నే ఎందుకు ఈ డౌట్ అడుగుతున్నావ్?" అడిగింది లలిత తెల్ల మొహంతో చూస్తూ.

ఆమె చిన్నగా నవ్వుతూ "భలేవారు మేడమ్, మీరు ప్రాసెస్ బ్రిలియంట్ అవార్డ్‌కి ఎంపిక అయిన ఫైనల్ లిస్టులో ఉన్నారు. రేపో మాపో ఆ అవార్డు అందుకోబోతున్నారు. అంటే ఈ ప్రాసెస్‌లో మీకే అందరికంటే ఎక్కువ తెలిసి ఉంటుందనే నమ్మకంతో మిమ్మల్ని అడుగుతున్నాను" చెప్పిందామె చిరునవ్వుతో.

"చచ్చింది గొర్రె.. ఇప్పుడు ఎలా?" అని మనసులోనే ఓ క్షణం ఆలోచించి ఇద్దరు ముగ్గురు స్నేహితులతో మాట్లాడి ఆమె డౌట్ క్లియర్ చేసి పంపి ఊపిరి పీల్చుకుంది.

అంతలోనే మరో కొత్త ఎంప్లాయ్ వచ్చి మరో సందేహం అడిగాడు. దాంతో మళ్లీ ఊపిరి ఆగినంత పనైంది. ఏమనాలో తెలియక "చెప్తాను" అని మళ్లీ ప్రాసెస్‌లో ఓ సీనియర్‌కి ఫోన్ చేసి వివరాలు మొత్తం విడమరిచి కనుక్కుని, తరువాత ఇతనికి చెప్పి పంపేసింది. అయితే వచ్చేప్పుడు ఇద్దరూ చాలా గౌరవంగా ఆమె వైపు చూశారు. కానీ వెళ్లేప్పుడు వాళ్ల చూపుల్లో కొంత తేడా కనిపించింది లలితకి. బహుశా అవార్డుకి ఎన్నికైన అమ్మాయి అలా అడిగితే ఇలా చెప్తుందనుకున్నాం.. కానీ ఈవిడేంటీ ఇలా తెల్ల మొహం వేసి నీళ్లు నమిలింది.. అనే సందేహం వారికి కలిగి అలా చూసి ఉండొచ్చు.. అనుకుంది మనసులో.

ఇంతలో మరొకరు తన కేబిన్ వైపు రావడం చూసింది లలిత. ఆమె గుండెల్లో రాయి పడింది.

కానీ.. ఇంతలో ఇందాక లలితని కలవడానికి వచ్చిన అమ్మాయి అతడిని ఆపి, ఎక్కడికి? అని అడిగినట్టుగా లలిత గ్లాస్ కేబిన్ రూమ్‌లో నుండి స్పష్టంగా కనపడింది. అయితే ఆమె తల పట్టుకుని తర్వాత లలిత పక్క కేబిన్‌లోకి వెళ్లమన్నట్టు సైగ చేసింది.


అది చూసిన లలిత మొదట హమ్మయ్య అనుకున్నా, తర్వాత కొద్దిసేపటికి ఆలోచనలో పడింది. "అతన్ని ఆమె ఆపకపోతే నేరుగా నా కేబిన్‌లోకే వచ్చేవాడు.


కానీ ఆమె అతన్ని నా దగ్గరికి వద్దు.. అని నా పక్క కేబిన్‌లోకి వెళ్లమంది. బహుశా ఆమె ఇందాక వచ్చినప్పుడు నేను ఆమె అడిగిన సందేహానికి చక చకా చెప్పకుండా నాంచి, నాంచి ఆమెనే యక్ష ప్రశ్నలు వేసాను. ఆ తర్వాత మరొకరికి ఫోన్ చేసి, ఆమెకి వివరం చెప్పాను. అందుకయ్యుంటుంది. ఇంకా ఆ అవార్డ్ రాకుండానే నాపై ఇంత పెద్ద అంచనాలు ఉన్నాయ్. ఒకవేళ ఆ అవార్డ్ వచ్చాక, ప్రాసెస్‌లో నేను సరిగా అందరి డౌట్స్ క్లియర్ చేయడంలో తడబడితే నా పరువు ఏమవుతుంది.. ఏం చేద్దాం?" అని ఆలోచిస్తుండగా అటుగా వెళ్తున్న అప్పారావ్ వాచీ చూసుకుంటూ నెత్తి కొట్టుకుంటున్నాడు.


అది చూసి "అదేవిటీ.. అలా నసుగుతూ నెత్తి బాదుకుంటున్నావ్?" అడిగింది లలిత.

"ఎం చెప్పమంటారు మేడమ్‌గారూ! మా బావమరిది చేతికున్న స్మార్ట్ వాచ్ చూసి గొప్పకు పోయి నేనూ అచ్చం అలాంటి డిజిటల్ స్మార్ట్ వాచ్ కొనేసి పెట్టుకున్నానండీ. కానీ నాకు అందులో టైమ్ చూడ్డం రావడం లేదు. గొప్పకి పోయి దీన్ని చేతికి తగిలించుకుంటే ఇపుడు ఇది నా పీకకి చుట్టుకున్నట్లయింది. ఆ మాటలతో లలిత బుర్ర గోక్కుని "అవును ఇప్పుడు గొప్పకో, డాబుకో పోయి ఈ అవార్డ్ తీసుకుంటే– రేపు నాతో పాటు నన్ను నమ్మి ఎంతో అభిమానంగా ఈ అవార్డ్‌కి ఎంపిక చేసిన సీ.ఈ.ఓ.గారికి కూడా మాట రావచ్చు" అని మనసులో అనుకుంది. ఓ క్షణం ఆలోచించి వెంటనే తనకి ఆ అవార్డ్ వద్దనీ, దానికి తగ్గ అర్హత ఇంకా ఆమె వద్ద లేదని అతనికి వాట్సప్ పెట్టింది. ❑


# ఈ వారం కా'ర్టూన్స్'


నీవు మనిషిని పెంచుకోడం ఏంట్రా? ఏంటా కోరిక ఇడియట్..!!
Zakir...


..చదువు కాదు.. మధ్యాహ్న భోజనం శుచిగా, రుచిగా ఉందా..లేదా..? టాయిలెట్లు శుభ్రంగా ఉన్నయా లేదా చూస్తారు.. ముందా పని చూడండి!
హెడ్మాస్టర్
Zakir...


అత్తెస్సా.. నేనలసి పోయాను.. లేట్ ఎందుకైందో కనుక్కుని నీవే రెండు తగిలించు..!!
Zakir...

ఫోటో ఫీచర్



అరుణాచల్ ప్రదేశ్‌లోని ఈ వ్యాలీని 'తవాంగ్ వ్యాలీ' అంటారు. సముద్ర మట్టానికి సుమారు పది వేల అడుగుల ఎత్తులో వుంది. డిసెంబరు-జనవరి మాసాల్లో మంచు కురుస్తూ వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది.



